



పులి ఆవాసానికి కీలకమైన ఆత్మకూరు అటవీ డివిజన్

జంతు ప్రపంచానికి రారాజు

- పర్యావరణ పిరమిడ్‌లో అగ్రభాగాన పెద్దపులి
- ప్రపంచంలోనే ప్రసిద్ధికెక్కిన వన్యప్రాణిగా గుర్తింపు
- దేశానికే తలమానికంగా నిలిచిన నాగార్జునసాగర్ -శ్రీశైలం టైగర్ ప్రాజెక్ట్
- నేడు పెద్దపులిని భారత ప్రభుత్వం జాతీయ జంతువుగా స్వీకరించిన రోజు

పర్యావరణ పరిరక్షణలో అత్యంత కీలకమైన పెద్దపులిని జాతీయ జంతువుగా 1972 నవంబరు 18న భారత ప్రభుత్వం ప్రకటించింది. ఆ సమయంలోనే టైగర్ రిజర్వు ఫారెస్ట్‌లను 1973 ఏప్రిల్ 1వ తేదీన దేశ వ్యాప్తంగా ఎంపిక చేశారు. 1972 పెద్దపులుల గణాంకాల ప్రకారం దేశంలో 1827 పులులు మాత్రమే ఉండేవి. కానీ.. 2022 పులుల గణాంకాల ప్రకారం మన దేశంలోని 18 రాష్ట్రాల్లో గల 58 టైగర్ రిజర్వు ఫారెస్ట్‌ల పరిధిలో 3167 ఉన్నట్లు అంచనా వేశారు. ప్రపంచంలోనే పులుల సంఖ్యలో దాదాపు 70శాతం పులులు మనదేశంలో ఉన్నాయని గర్వంగా చెప్పవచ్చు.

-ఆత్మకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి)



దేశానికే తలమానికం నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ ప్రాజెక్ట్

పెద్దపులి రాజసానికి ప్రతీక. పర్యావరణ సూచికలో త్రికోణ(పిరమిడ్) అగ్రభాగాన నిలిచిన సైబీరియన్ జాతికి చెందిన పెద్దపులి ప్రపంచంలోని పలు దేశాలకు జాతీయ చిహ్నంగా వెలుగొందుతోంది. అలాగే మరికొన్ని దేశాలు ఏకంగా తమ జాతీయ పతాకాల పైనే పెద్దపులి చిత్రాన్ని రూపొందించుకున్నాయి. రెడ్‌డేటా బుక్‌లో చోటు సంపాదించుకుని షెడ్యూల్-1 కోవకు చెందిన పెద్దపులి యావత్ భూప్రపంచంలో అంతరించి పోతున్న జంతువుగా గుర్తింపు దక్కించుకుంది. ఫాన్థెరటైగ్రీస్ కుటుంబానికి చెందిన పెద్దపులిని ఎన్నోదేశాలు జాతీయ జంతువుగా ఎంచుకున్నాయి.



దేశంలో పులుల వృద్ధిరేటు తగ్గేందుకు కారణాలు..

వన్య జీవనంలోని పులి ఆయుర్ధాయం పదేళ్ల ఉండగా, జంతు ప్రదర్శనశాలల్లో 20ఏళ్ల వరకు వుంటుంది. అయితే దేశంలో పులుల వృద్ధిరేటు తగ్గేందుకు అనేక కారణాలు కనిపిస్తున్నాయి. ప్రత్యేకించి అడవులు క్షీణించి పంటపొలాలు పెరగడం, రోడ్లు, జలాశయాలు, గనులు, జలఉత్పత్తి కేంద్రాలు, వ్యవసాయంతో పాటు పులి ఆహారమైన హెర్బివోట్స్(గడ్డితినే జంతువుల)ను వేటాడటం వల్ల పులి ఉనికికే ముప్పు వాటిల్లుతోంది. పులి జీవన విధానం ప్రకారం దాని నిర్విఘ్న జీవనానికి, ప్రత్యుత్పత్తికి, ఆటంకం లేని ఆవాసాలు ఎంతో అవసరం. మానవ కార్యకలాపాలు లేని నిషిద్ధ ప్రాంతాలు పులి జీవనానికి కీలకం. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని 1972లో ఇలాంటి కారణాలను గుర్తించే పెద్దపులుల అభయారణ్యాలను ఎంపిక చేశారు. అదేక్రమంలో పెద్దపులిని జాతీయ జంతువుగా ఎంపిక చేసి వాటి సంరక్షణకే కేంద్ర అటవీ, పర్యావరణ శాఖలు పులుల సంరక్షణకు శ్రీకారం చుట్టాయి.

మిగతా 6వ పేజీలో

వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు: కలెక్టర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

నంద్యాల, నూనెపల్లి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపవద్దని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమెతో పాటు డీఆర్వో రామునాయక్, ఎస్డీసీలు, డీఆర్డీఏ పీడీ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను నాణ్యతతో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్ వారికి అర్థమయ్యేలా స్పష్టంగా ఉండాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించి రీ ఓపెన్‌కు తావు లేకుండా చూడాలన్నారు. జిల్లాలో భూ సమస్యలపై ఎక్కువగా అర్జీలు వస్తున్నాయని, రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని సూచించారు. ప్రజల నుంచి సేకరించిన ఫీడ్‌బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తోందని, ఈ విషయాన్ని అధికారులు గుర్తించుకొని ఫిర్యాదుదారులతో స్నేహ పూర్వకంగా మాట్లాడాలని సూచించారు. ప్రజలు వివిధ సమస్యలపై 140 అర్జీలు సమర్పించారని, వీటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం: మంత్రి



మార్కెట్ యార్డు చైర్మన్ హరిబాబుతో కలిసి పత్తిని పరిశీలిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. పట్టణ సమీపంలోని మురారి కాటన్ మిల్‌లో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ యార్డు చైర్మెన్ గుంటుపల్లి హరిబాబుతో కలిసి సోమవారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రైతులు పండించిన పత్తి పంటకు సరైన మద్దతు ధర లభించేలా కొనుగోలు కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. దళారుల వ్యవస్థను తొలగించి పారదర్శకతతో కూడిన కొనుగోళ్లను ప్రోత్సహించడమే ఈ కేంద్రాల ప్రధాన లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎన్ఎండీ ఫయాజ్, చాబోలు ఇలియాజ్, రంగప్రసాద్, పబ్బతి రవి, విజయగౌరి, కాల్వ శ్రీను పాల్గొన్నారు.

నాలుగు మండలాల్లో
సహకార సంఘం ఎన్నికలు వాయిదా

ఆళ్లగడ్డ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని రుద్రవరం, దొర్నిపాడు, ఉయ్యాలవాడ, శిరివెళ్ల మండలాల్లోని పలు గ్రామాల్లో నిర్వహించాల్సిన నంద్యాల విజయ డెయిరీ ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం ఎన్నికలు వాయిదా పడినట్లు ఆ మండలాల ఎంపీడీవోలు భాగ్యలక్ష్మి, సావిత్రి, ఉమామహేశ్వరరావు, శివమల్లేశ్వరప్ప సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ మండలాల్లో పాలక వర్గ సభ్యులు, ఎన్నికల అధికారులు సాయంత్రం 4.00 వరకు రాకపోవడంతో ఎన్నికలను వాయిదా వేసినట్లు వారు తెలియజేశారు.

'ఆవాస్ ప్లస్' సర్వేను వేగవంతం చేయాలి
కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల నూనెపల్లి 17 (ఆంధ్రజ్యోతి) : ఆవాస్ ప్లస్ గ్రామీణ్ యోజన-2024 సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాల్‌లో కలెక్టర్ వివిధ అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు ఇల్లు నిర్మించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆ దిశగా హౌసింగ్ అధికారులు సమన్వయంతో పనిచేసి సర్వేను పూర్తి చేయాలన్నారు. ఈ సర్వేలో ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని మండలాలన్నీ చాలా వెనుకబడి ఉన్నాయన్నారు. స్వర్ణ పంచాయతీలకు సంబంధించి పన్ను వసూలు పూర్తి చేయాలన్నారు.

కుష్ఠు రహిత జిల్లాగా మార్చాలి : నంద్యాలను కుష్ఠు రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లో జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలనకు సంబంధించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. 30వ తేదీ వరకు కుష్ఠు వ్యాధికి సంబంధించి ఇంటింటి సర్వేను పక్కాగా చేపట్టాలని సూచించారు.

సాగు చేయాలంటే.. వాగు దాటాల్సిందే

- వంతెన కోసం రైతుల ఎదురుచూపు

చాగలమర్రి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామ సమీపంలోని గోపాయపల్లె రహదారి వద్దగల అడ్డవాగు వరద నీరు దాటేందుకు రైతులు, కూలీలు అవస్థలు పడుతున్నారు. వాగు సమీపంలో 2 వేల ఎకరాల్లో మొక్కజొన్న, మినుము, కంది, జొన్న తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ పంట పొలాలను నమ్ముకొని సుమారు 600 మంది రైతులు, కూలీలు జీవిస్తున్నారు. వర్షపు నీరు, టీజీపీ లీకేజీ నీరు కలిసి అడ్డవాగుకు చేరడంతో రైతులు వాగు దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అడ్డవాగుపై వంతెన నిర్మించక పోవడంతో 16 ఏళ్ల నుంచి రైతులు అవస్థలు పడుతున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో అడ్డవాగులో వరద నీరు తగ్గక, పండించిన మొక్కజొన్న ధాన్యాన్ని తరలించుకునేందుకు వీలు లేక వదిలేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో పంట పొలాల్లోనే మొక్కజొన్న కుళ్లిపోయి రైతులకు భారీ నష్టం వాటిల్లింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి పర్యాటకశాఖ మంత్రి భూమా అఖిలప్రియ అడ్డవాగుపై వంతెన నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. అయితే ఇంతవరకు వంతెన పనులకు నోచుకోలేదు. ప్రతి ఏడాది వర్షాకాల సమయంలో వాగు దాటేందుకు రైతులు, కూలీలు నరకయాతన పడుతున్నారు. తమ కష్టాలను దృష్టిలో పెట్టుకొని వాగు నిర్మాణం చేపట్టి తమను ఆదుకోవాలని రైతులు, కూలీలు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైన వంతెన పనులు చేపట్టి తమ కష్టాలు తీరుతాయని రైతులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు.



అడ్డవాగు వరద నీటిని ఎద్దులబండితో దాటుతున్న రైతు



విద్యుత్ స్తంభాలపై వాగు దాటుతున్న మహిళా కూలీలు

బాధితులకు న్యాయం చేస్తాం
అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు

నంద్యాల టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): బాధితుల ఫిర్యాదులపై విచారించి న్యాయం చేస్తామని అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు అన్నారు. పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. చట్ట పరిధిలోని సమస్యలను చట్ట పరిధిలో పరిష్కారం తక్షణమే చేయాలన్నారు. పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించ కూడదన్నారు. ఫిర్యాదిదారులు జిల్లా పోలీసు కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని, స్థానికంగా ఉన్న స్టేషన్లలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎక్కువగా అత్తారింటి సమస్యలు, ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేయడం, పొలం తగదాలు, అన్నదమ్ముళ్ల ఆస్తి గొడవలు తదితర సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ

గ్రీన్ కో రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు దేశానికే ఆదర్శం

- గ్రీన్ పవర్ నిల్వలో పీఎస్పీలదే కీలక పాత్ర
- దేశ వ్యాప్తంగా 224 జీడబ్ల్యూ పీఎస్పీ సామర్థ్యం గుర్తింపు
- కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్



మొక్కకు నీరు పోస్తున్న కేంద్ర మంత్రి మనోహర్ లాల్

ఓర్వకల్లు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని గ్రీన్ కో రెన్యువబుల్ ఎనర్జీ పవర్ ప్రాజెక్టు భవిష్యత్తులో దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని కేంద్ర విద్యుత్, గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గుమ్మితం తండా సమీపంలో ఉన్న గ్రీన్ కో పవర్ ప్రాజెక్టు పరిసర ప్రాంతాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పవర్ ప్రాజెక్టు ప్రాంగణంలో పార్లమెంటు సభ్యుల సంప్రదింపుల కమిటీ సమావేశాన్ని విద్యుత్ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసింది. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులపై దృష్టి సారించిన ఈ సమావేశానికి కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అధ్యక్షత వహించారు. విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద యెస్సో నాయక్, లోక్ సభ, రాజ్య సభ నుంచి విద్యుత్, మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యులు, కేంద్ర విద్యుత్ అథారిటీ సీఈఏ, సీపీఎస్‌యూల నుంచి సీనియర్ అధికారులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సభ్యులను ఉద్దేశించి కేంద్ర మంత్రి మాట్లాడుతూ సౌర శక్తి లేని సమయాల్లో మిగులు గ్రీన్ పవర్‌ను నిల్వ చేయడం, విద్యుత్ డిమాండ్‌ను తీర్చడం ద్వారా పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు(పీఎస్పీ)లు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.

మిగతా 6వ పేజీలో..

శ్రీగిరిపై కార్తీక సందడి



పుష్కరిణికి హారతి

- ఆఖరి సోమవారం భక్తులతో కిటకిటలాడిన శ్రీశైల క్షేత్రం
- దర్శనానికి రెండు గంటల సమయం

శ్రీశైలం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహా క్షేత్రంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆఖరి సోమవారం సందర్భంగా వేలాదిగా తరలివచ్చిన భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు, కార్తీక దీపదానాలు చేసుకున్నారు. తెల్లవారుజామున సుప్రభాతసేవ మహామంగళ హారతి అనంతరం 4 గంటల నుంచి రాత్రి 10:30 గంటల వరకు స్వామి, అమ్మవార్ల సర్వ దర్శన సౌకర్యం కల్పించారు. ఉభయ దేవాలయాల్లో సుమారు రెండు గంటలపాటు దర్శన సమయం పడుతున్నట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. క్షేత్రానికి వచ్చే ప్రతి భక్తులందరికీ దర్శనం కల్పించే దిశగా తగు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అదే విధంగా క్యూలైన్లలో వేచి ఉండే యాత్రికులకు సాంబార్ అన్నం, పులిహోర, పాలు, తాగునీరు, బిస్కెట్లు వంటి అల్పాహారాన్ని శివసేవకులతో నిరంతర పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అన్నదాన భవనంలో రోజూ సుమారు ఐదువేల మంది అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్నట్లు తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా 10 కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రసాదాలను అందిస్తున్నారు. ఉత్తర మాడవీధితో పాటు గంగాధర మండపం వద్ద కార్తీక దీపాలు వెలిగించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆఖరు సోమవారం సుమారు 40 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు.



స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా తీసుకెళ్తున్న అధికారులు, సిబ్బంది



భక్తులతో కిటకిటలాడుతున్న పరిసరాలు

లక్ష దీపోత్సవం

శ్రీశైల మహాక్షేత్రంలో పరమశివునికి ప్రీతికరమైన కార్తీకమాసంలో ఆఖరి సోమవారం రోజున భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్త పూజలు ఘనంగా నిర్వహించారు. సాయంకాలం ఉత్సవమూర్తులను ఆలయ ఉత్సవంగా పుష్కరిణి వద్దకు తీసుకువచ్చి దశవిధ హారతులను ఇచ్చారు. పుష్కరిణి నాలుగువైపులా లక్షదీపోత్సవాన్ని నిర్వహించి శివసేవకులు, భక్తులు దీపాలు వెలిగించుకోవటానికి అవకాశం కల్పించారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాసరావు, ఆలయ పీఆర్వో శ్రీనివాసరావు, ఎడిటర్ అనిల్‌కుమార్, ఈఈ నర్సింహా రెడ్డి, డీఈ శాస్త్రి, ఏఈవోలు, పర్యవేక్షకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



గ్రీన్ కో రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు దేశానికే ఆదర్శం

(5వ పేజీ తరువాయి)

పీఎస్పీ జలాశయాల నుంచి బాష్పీభవన నష్టాల సమస్యలపై ఆచరణీయ పరిష్కారంగా తేలియాడే సౌర విద్యుత్ ప్రాజెక్టులను అమలు చేయాలని మంత్రి సూచించారు. సకాలంలో స్థల కేటాయింపు, నీటి కేటాయింపు వేగవంతమైన అనుమతుల ద్వారా పీఎస్పీ అభివృద్ధిని సులభతరం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వాల కీలక పాత్రను ఆయన నొక్కి చెప్పారు. పీఎస్పీల అభివృద్ధిని వేగవంతం చేయడానికి గ్రీన్ ఎనర్జీ సెస్, నీటి పన్ను, రిజర్వాయరు లీజు, ఫీజులు వంటి చార్జీలను ఉపసంహరించుకోవడం గురించి రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించాలని ఆయన కమిటీ సభ్యులను కోరారు. దేశవ్యాప్తంగా దాదాపు 224 జీడబ్ల్యూ పీఎస్పీ సామర్థ్యాన్ని గుర్తించినట్లు కమిటీ సభ్యులకు సమాచారం అందిందని తెలిపారు. వీటిలో దాదాపు 7 జీడబ్ల్యూ మొత్తం సామర్థ్యం కలిగిన పది పీఎస్పీలు ప్రారంభించినట్లు తెలిపారు. విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద యెస్సో నాయక్ కమిటీ సభ్యులతో మాట్లాడుతూ 2025-26లో 1680 మెగావాట్ల పిన్నాపురం పీఎస్పీలోని ఎనిమిది యూనిట్లను 500 మెగావాట్ల టెహ్రీ పీఎస్పీతో పాటు విజయవంతంగా ప్రారంభించడం గొప్ప విజయమని ఆయన కొనియాడారు. కేంద్ర మంత్రి వెంట గ్రీన్ కో గ్రూప్ సీఈవో, ఎండీ చలమశెట్టి అనిల్, గ్రీన్ కో ప్రాజెక్టు డెరెక్టర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసనాయుడు ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

రాష్ట్రానికి పరిశ్రమలు క్యూ

న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్



మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పరిశ్రమలు క్యూ కడుతున్నాయని న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యతో కలిసి మాట్లాడారు. ఏపీ పెట్టుబడుల దిశను మార్చే విధంగా సీఐఐ భాగస్వామ్య సదస్సు జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఎంతో రాష్ట్రాభివృద్ధికి ఎంతగానో శ్రమిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర మూడు ప్రాంతాలకు సమానంగా పెట్టుబడులు వచ్చేలా పలు కంపెనీలతో మార్గదర్శనం చేశారన్నారు. ప్రతి రంగానికి స్పష్టమైన పాలసీలు రూపకల్పన చేసి సింగిల్ విండో సిస్టం ద్వారా పెట్టుబడులకు అనుమతులు వేగంగా ఇవ్వడం పరిశ్రమల ఆకర్షణకు ప్రధాన కారణమన్నారు. చంద్రబాబు విజన్ వల్ల 613 ఒప్పందాల ద్వారా రూ13,25,716 లక్షల పెట్టుబడులు, 16,13,188 ఉద్యోగాలు రావడం రాష్ట్రాభివృద్ధి పట్ల పెట్టుబడిదారుల నమ్మకానికి ప్రత్యక్ష సాక్ష్యం అని కొనియాడారు. సమ్మిట్ కంటే ఒకరోజు ముందే పెట్టుబడిదారుల వరద మొదలైందన్నారు. ఇందులో రూ3,65,304 కోట్ల పెట్టుబడులతో 1,26,471 ఉద్యోగాలు సృష్టించే 35 సంస్థలతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోవడం చాలా గొప్ప విషయమన్నారు. ఏపీ సీఆర్డీఏ, ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ టూరిజం, మున్సిపల్ వంటి కీలక శాఖలలో పెట్టుబడుల కోసం ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. గతంలో జగన్ విధంసకర విధానాలకు బయపడి పారిపోయిన రెన్యూ, హీరోఫ్యూచర్స్, ఏటీసీ వంటి కంపెనీలు బాబు పాలనకు ఆకర్షితులై తిరిగి రాష్ట్రానికి రావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు, ఉప్పరి, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్లు సురేష్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా రామదాసు రథోత్సవం



భక్తజన సందోహం నడుమ స్వామివారి రథోత్సవం

కోడుమూరు రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్దగిరిలో రామదాసుస్వామి రథోత్సవం సోమవారం సాయంత్రం కనులపండువగా జరిగింది. తిరునాళ్లను పురస్కరించుకుని రథంపై స్వామివారు ఊరేగారు. వేడుకను పురస్కరించుకుని ఆలయంలో అభిషేకం, పుష్పార్చన, ఆకుపూజ, హోమం, హారతులు నిర్వహించారు. సాయంత్రం రామదాసుస్వామి ఉత్సవ విగ్రహాన్ని సుందరంగా ముస్తాబు చేసిన రథంపై కొలువుదీర్చారు. అనంతరం కొబ్బరి, గుమ్మడికాయలను కొట్టి సాత్విక బలిదానం చేశారు. దీంతో భక్తులు జయజయధ్వానాలు చేస్తూ రథాన్ని స్మారక మందిరం దగ్గరకు, తిరిగి ఆలయం వద్దకు లాగారు. పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. వేడుకల్లో 'కుడా' మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోట్ల చక్రపాణిరెడ్డి, టీడీపీ నాయకులు కోట్ల రాఘవేంద్రారెడ్డి, కోట్ల కౌశిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు మురళీకృష్ణ ఆలయంలో పూజలు చేశారు.

కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వే ప్రారంభం

కర్నూలు హస్పిటల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధిని నిర్మూలించేందుకు 17 నుంచి 30వ తేదీ వరకు వ్యాధిగ్రస్థులను గుర్తించే సర్వే నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో ఎల్.భాస్కర్ తెలిపారు. సోమవారం నగరంలోని అరోరానగర్‌లో లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ సర్వేను డీఎంహెచ్‌వో ప్రారంభించారు. కుష్టువ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స చేయించుకోవాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వలంటీర్లు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారని, ఇందుకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యూక్లియర్ మెడికల్ ఆఫీసర్ మల్లికార్జునరెడ్డి, డాక్టర్ లీనారెడ్డి, సునీలమ్మ, డీపీఎంవో సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్ రెడ్డి, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

ఆకతాయిల ఆటకట్టు



ఆకతాయిల ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. మహిళలు, యువతులు, విద్యార్థినులు నిత్యం ఎక్కడో ఒక చోట వేధింపులకు గురవుతూనే ఉన్నారు. ఎవరితోనూ చెప్పుకోలేక లోలోపల కుమిలిపోతున్న వారెందరో. దీంతో వీరు ఇంటినుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. వీటన్నిటికీ చెక్ పెట్టడానికి ప్రభుత్వం 'శక్తి' యాప్‌ను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు బృందాలను ఏర్పాటు చేసింది. స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేదు. శక్తి యాప్‌లో ఫిర్యాదు చేస్తే చాలు.. శక్తి టీం సభ్యులు స్పందించి చర్యలు తీసుకుంటారు.

- ప్రత్యేక బృందాలతో నిరంతరం నిఘా
- 'శక్తి' యాప్‌పై అవగాహన కార్యక్రమాలు
- హాట్‌స్పాట్ ప్రదేశాలను గుర్తించి నిఘా

నంద్యాల టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిల ఆగడాలకు కళ్లెం వేసేలా ఏర్పటైన శక్తి టీమ్స్ మహిళా భద్రతకు భరోసానిస్తాయి. ప్రేమపేరుతో యువకుల నుంచి విద్యార్థినులు, యువతులు పడుతున్న ఇబ్బందులను అరికట్టేలా నంద్యాల ఎస్పీ సునీల్ షెరాన్ ఆధ్వర్యంలో జిల్లాలో 40 మంది సిబ్బందితో ఒక్కో టీమ్‌లో ఐదుగురు చొప్పున ఎనిమిది బృందాలను ఏర్పడ్డారు. వీరికి ఇద్దరు సీఐలు వీరికి నేతృత్వం వహిస్తున్నారు. జిల్లాలో 1,694 అవగాహన సదస్సులు 154 ఆత్మరక్షణ శిబిరాలు ఏర్పాటు చేశారు.

ప్రధాన కూడళ్లలో నిఘా



శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్నా సీఐ జయరాములు

జిల్లాలో నంద్యాలతో పాటు ముఖ్యమైన నియోజకవర్గాల్లో ముఖ్య కూడళ్లలో కళాశాలలు, పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్ల వద్ద నిరంతరం నిఘా పెడుతున్నారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో షీటీమ్స్ సమర్థవంతంగా పని చేశాయి. పట్టణ ప్రాంతాల్లో మఫ్టీలో ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ నిఘా కొనసాగిస్తూ ఈవ్‌టీజింగ్‌ను కట్టడి చేశాయి. కూటమి ప్రభుత్వం శక్తి యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

బృందాల పనితీరుపై నిఘా

శక్తి టీం పనితీరును డీజీపీ కార్యాలయం నుంచి నిరంతరం పర్యవేక్షిస్తుంటారు. ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించిన నివేదికలను బృంద సభ్యులు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు పంపుతున్నారు. ప్రేమ పేరుతో, ఈవ్ టీజింగ్ చేయడం వల్ల విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ఎవరికీ చెప్పుకోలేక ఇబ్బందులు పడుతుంటారు. ఇంట్లో వాళ్లకు చెబితే చదువు మాన్పించి వేస్తారన్న భయంతో విద్యార్థినులు తమలో తామే కుమిలిపోతున్నారు. ఇలాంటి వారంతా శక్తి యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే ఆకాతాయిలను ఆట కట్టించాడనికి శక్తి టీమ్‌లు సిద్ధంగా ఉన్నాయి.

మహిళలకు రక్షణగా 'శక్తి' యాప్

నంద్యాల జిల్లాలో ఇప్పటివరకు సుమారుగా 46 వేల మంది శక్తి యాప్‌ను వారి సోల్‌ఫోన్‌ల్లో డౌన్‌లోడు చేయించి వారికి ఎలా ఫిర్యాదు చేయాలి? అని అవగాహన కల్పించారు. అంతేకాకుండా జిల్లాలో కొన్నింటిని హాట్ స్పాట్ ప్రాంతాలుగా గుర్తించి వాటిపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేస్తున్నారు. పట్టణంలో ఎన్జీవోస్ కాలనీ, ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్, ఆత్మకూరు బస్టాండు, ఆళ్లగడ్డలోని పలు ప్రధాన ప్రాంతాలు, నందికొట్కూరు వంటి బనగానపల్లె వంటి ప్రాంతాల్లో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసి ఈయా ప్రాంతాల్లో నిరంతరం సిబ్బంది తిరుగుతూ రక్షణ కల్పిస్తున్నారు. అలాగే ఆత్మరక్షణలో ఏదైనా సమస్యలు వచ్చినప్పుడు వారికి వారే స్వయంగా కాపాడుకునే విధంగా ప్రత్యేకంగా శిబిరాలు నిర్వహించి విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నారు.



ఆత్మ రక్షణ విద్యను నేర్పిస్తున్న సిబ్బంది

జిల్లాలో జరిగిన ఘటనలు

నంద్యాల ఎన్జీవోస్ కాలనీలో అక్కడ బ్యాంకు కోచింగ్ చదువుతున్న ఒక అమ్మాయిని ప్రేమ పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని శక్తి టీం వారికి ఫిర్యాదు అందింది. వెంటనే అక్కడికి చేరుకున్న సిబ్బంది ఆకతాయిని పట్టుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఇలాంటివి పునరావృత్తం కాకుండా ఉండాలని సూచించారు. నంద్యాల బస్టాండులో బస్సు ఎక్కడానికి వచ్చిన విద్యార్థినులను కొంత మంది ఆకతాయిలు ఇబ్బందులకు గురి చేస్తుండడంతో శక్తి యాప్ ద్వారా ఫిర్యాదు అందుకుని సమస్యను పరిష్కరించారు. నంద్యాల ఓల్డ్ టౌన్‌లో భర్త తాగి వచ్చి భార్యను కొడుతున్నాడని, ఇబ్బందులకు గురి చేస్తున్నాడని సమాచారం మేరకు అక్కడికి చేరుకుని ఆమెకు రక్షణ కల్పించారు.

ధైర్యంగా ఫిర్యాదు చేయండి

మహిళలు, యువతులుచ విద్యార్థినులు ఆకతాయిల బారి నుంచి కాపాడటమే శక్తి టీం విధి. 40 మంది సిబ్బందితో నిరంతరం నిఘా ఏర్పాటు చేశాం. పాఠశాల్లో, కళాశాల్లో శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్నాం. ఎవరైనా ఫిర్యాదు యాప్ ద్వారా చేయవచ్చు. 112 నంబరుకు ఫోన్ చేసిన ఫిర్యాదులు స్వీకరిస్తాం. బాధితులు ధైర్యంగా ఫిర్యాదు చేయొచ్చు.

- జయరాములు సీఐ, మహిళా స్టేషన్, నంద్యాల

శివనామస్మరణతో హోరెత్తిన యాగంటి

ఘనంగా కార్తీక చివరి సోమవారం



యాగంటిలో క్యూలైన్‌లో భక్తులు

బనగానపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక చివరి సోమవారం సందర్భంగా యాగంటి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. శివనామ స్మరణతో యాగంటి క్షేత్రం హోరెత్తింది. ఉమామహేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామున ఉమామహేశ్వరస్వామి వార్లకు అభిషేకం, మహారుద్రాభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం వద్ద మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అర్చనలు, అభిషేకాలు రద్దు చేశారు. కిందిభాగంలో పుష్కరిణి పక్కనుంచి ప్రత్యేక క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రధాన పుష్కరిణిలో భక్తులు స్నానమాచరించి యాగంటి బసవేశ్వరస్వామిని, ఉమామహేశ్వరస్వామిని దర్శించుకున్నారు. క్షేత్రపాలకుడు వీరభద్రస్వామి వార్లకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. క్యూలైన్‌లో ఎండ తగులకుండా భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. మనోజ్ అనే భక్తుడు భక్తులకు నీటివసతిని కల్పించారు. క్యూలైన్లను సీఐ ప్రవీణ్ కుమార్, మంజునాథరెడ్డి, బనగానపల్లె ఎస్ఐ దుగ్గిరెడ్డి, అవుకు ఎస్ఐ రాజారెడ్డి బందోబస్తు పర్యవేక్షించారు ఉమామహేశ్వర నిత్యాన్నదాన సత్రంలో పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో దొనపాటి యాగంటిరెడ్డి, దస్తగిరిరెడ్డి, రామారెడ్డిలు భక్తులకు అన్నదానం చేశారు. ఉమామహేశ్వర రెడ్ల అన్నదానసంస్థ, ఆర్యవైశ్య నిత్యాన్నదాన సంస్థ, వీర శైవ లింగాయత్ బసవేశ్వర అన్నదాన సంస్థలతో పాటు గాయతరి బ్రాహ్మణ సంఘం, గోశాల వద్ద బుర్రావెంకటేశ్వర్లు, మారునీళ్ల చెలిమ వద్ద రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఉచిత భోజన వసతి భక్తులకు కల్పించారు.



ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

బనగానపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని పసుపుల గ్రామ సమీపంలోని గుండం మల్లికార్జున స్వామి ఆలయం వద్ద కార్తీక చివరి సోమవారం సందర్భంగా నిర్వహించిన బండలాగుడు పోటీలను బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి సోమవారం ప్రారంభించారు. ముందుగా గుండం మల్లికార్జునస్వామికి బీసీ రాజారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం చైర్మన్ సిద్దేశ్వరప్ప ఆధ్వర్యంలో ఉత్సవాలు వైభవంగా సాగాయి. శివచంద్రస్వామి ఆధ్వర్యంలో మంత్రాలయానికి చెందిన పండిత్ గౌతమి స్వామి బృందం ఆధ్వర్యంలో ఉదయం గణపతి హోమం, రుద్ర, లక్ష్మినరసింహ, నవగ్రహ, మృత్యుంజయ, ధన్వంతి, సుదర్శన హోమాలను నిర్వహించారు. అనంతరం రైతు సంబరాల్లో భాగంగా బండలాగుడు పోటీను బీసీ రాజారెడ్డి ప్రారంభిం చారు. పోటీల్లో పాల్గొనేందుకు 20 ఎడ్ల జతలు హోరాహోరీగా సాగాయి. ఎడ్ల యజమానులను బీసీ రాజారెడ్డి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలను వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇదిలా ఉండగా కార్తీక మాసం సందర్భంగా వేలాది మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సిద్దేశ్వరప్ప, టీడీపీ నాయకులు భూషన్న, షేక్షావలి, బాలనాయుడు, మధుసూధన్ నాయుడు, ఓబులేసు, తిరుపతినాయక్, జయనాయక్, అశోక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

వైభవంగా నేలబిళం తిరునాళ్లు

- పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తజనం
- పూజలో పాల్గొన్న పలువురు టీడీపీ నాయకులు



స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

కొలిమిగుండ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్ల మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నేలబిళం మల్లేశ్వరస్వామి తిరునాళ్ల సోమవారం వైభవోపేతంగా సాగింది. ఈ సందర్భంగా స్వామి వారి కళ్యాణం, రథోత్సవాలకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఆలయ ప్రాంగణంలోని పవిత్రమైన నేల బిళం (గుహ)లో స్నానం చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వర రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు మూలె రామేశ్వరరెడ్డి, నియోజకవర్గ కో కన్వీనర్ వీఆర్ లక్ష్మీరెడ్డి తదితరులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఎస్ఐ గోపాల్, 20మంది పోలీసులు ప్రత్యేక బందోబస్తు చేపట్టారు.

ఎస్పీ దృష్టికి 84 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, నవంబరు 17 (ఆంధ్ర జ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి సమస్యలు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 84 మంది ప్రజలు తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తెచ్చారు. వీటిలో ప్రధానంగా.. తెలిసిన వ్యక్తులతో కలిసి ఆన్‌లైన్‌లో జేఎం ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థ పేరుతో రూ.1.40 కోట్లు మోసం చేశారని అశోక్‌నగర్‌కు చెందిన యశ్వంత్ ఫిర్యాదు చేశాడు. భాను ప్రసాద్ అనే వ్యక్తి వైజాగ్‌లోని ఎల్‌టీడబ్ల్యూ కంపెనీలో వర్క్ ఫ్రమ్ హోం ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి రూ.1.50 లక్షలు చొప్పున 15 మందిని మోసం చేశాడని ఆదోనికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తామని చెప్పి మోసం చేశారని శరీన్‌నగర్ చెందిన జగన్నాథం ఫిర్యాదు చేయగా, ఆరుగురు కొడుకులు అన్నం కూడా పెట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని సి.బెళగల్ మండలం కొండాపురానికి చెందిన తిమ్మప్ప ఆవేదన వ్యక్తం చేశాడు. కార్యక్రమంలో ఏఎస్పీ హుసేన్ పీరా, సీఐలు రామకృష్ణ, ఇబ్రహీం ఉన్నారు.

బుక్కాపురంలో కార్తీక వన భోజనాలు

హాజరైన తానా అధ్యక్షుడు నిరంజన్



కార్యక్రమంలో పాల్గొన్న తానా అధ్యక్షుడు నిరంజన్

మహానంది, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక చివరి సోమవారం సందర్భంగా మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో కమ్మ సంఘం ఆధ్వర్యంలో వనభోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో తానా అధ్యక్షుడు నిరంజన్ పాల్గొన్నారు. కమ్మసంఘం సేవలను కొని యాడారు. అంతకముందు ఆయన మహానంది ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కమ్మ సంఘం నాయకులు గడ్డం నాగ పుల్లయ్య, హరిప్రసాద్, వేమూరి కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

జంతు ప్రపంచానికి రారాజు



(5వ పేజీ తరువాయి)

ఇతర వన్యప్రాణుల కంటే వైవిధ్యమైన మానసిక లక్షణాలు కలిగివున్న పెద్దపులికి ప్రపంచవ్యాప్తంగా విశేషమైన గుర్తింపు ఉంది. ఇంతటి విశిష్టత కలిగిన పెద్దపులి అవయవాలకు బహిరంగ మార్కెట్‌లో మంచి గిరాకీ వుందని చెప్పవచ్చు. విదేశీ మార్కెట్‌లో పులి చర్మం కనీస ధర రూ.50 లక్షల పైబడి పలుకుతున్నట్లు తెలుస్తోంది. పెద్దపులి ఒక కాలిగోరు విలువ రూ. 50వేల నుంచి రూ.లక్ష వరకు పలుకుతోంది. ఇలాంటి వ్యాపార దృష్టి ప్రకృతిలో అరుదైన, పర్యావరణంలో కీలకమైన పెద్ద పులుల మనుగడకు సవాల్‌గా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో కూడా దేశంలో, నల్లమలలో పులుల సంఖ్య పెరుగుతోంది.

దేశానికే తలమానికం నల్లమల :

నల్లమలలో విస్తరించిన నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం పులుల సంరక్షణలో దేశానికే తలమానికంగా నిలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాల పరిధిలో 3727.82చ.కి.మీల పరిధిలో విస్తరించి దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వు ఫారెస్ట్‌గా గుర్తింపు దక్కించుకుంది. ఇందులో 2444చ.కి.మీల కోర్ ఏరియా ఉండగా, 1283.82కిమీల బఫర్ ఏరియా గుర్తించారు. కాగా ఎన్ఎస్‌టీఆర్‌లో 2014-15లో 37 పెద్దపులులు ఉండగా ప్రస్తుత గణాంకాల ప్రకారం 2023-24లో ఎన్ఎస్‌టీఆర్‌లో 87 పెద్దపులులు ఉన్నట్లు అంచనా. మొత్తంగా పులికూనలతో కలిపి వందకుపైగానే ఉన్నట్లు తెలుస్తోంది. 2023 మార్చి నెలలో ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని ముసలిమడుగు సెక్షన్‌లోని పెద్దగుమ్మడాపురం గ్రామ సమీపంలో ఓపెద్దపులి నాలుగు ఆడపులి కూనలకు జన్మనిచ్చింది. అయితే తల్లిపులి నుంచి పులికూనలు దూరమైనప్పటికీ ఒకే ఈతలో ఏకంగా నాలుగు పులికూనలకు జన్మనివ్వడం దేశవ్యాప్తంగా సంచనంగా మారింది. నల్లమలలో పులుల సంఖ్య రెట్టింపు అవుతున్న క్రమంలో కారిడార్‌ను పెంచే అవకాశం వుందని అటవీ అధికారులు చెబుతున్నారు.

పర్యావరణ పరిరక్షణలో పెద్దపులి మనుగడే కీలకం



పర్యావరణ పరిరక్షణలో పెద్దపులి మనుగడ కీలకం. పులి ఆవాసాన్ని ఏర్పాటు చేసుకున్న చోట వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి. పర్యావరణం సమతుల్యంగా వుంటుంది. పులుల రక్షణకై అటవీశాఖ ఎంతో కృషి చేస్తోంది. ప్రత్యేకించి పులుల ప్రత్యుత్పత్తి కోసం అడవుల్లో అనుకూల వాతావరణ పరిస్థితుల్ని ఏర్పాటు చేస్తున్నాం.

- విఘ్నేష్ అప్పావు, డిప్యూటీ డైరెక్టర్, ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్

వ్యక్తి అనుమానాస్పద మృతి



శ్రీనివాసులు (ఫైల్)

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన గడిగే శ్రీనివాసులు (57) ఎల్లెల్సీ కాలువలో అనుమానాస్పదంగా మృతి చెందాడు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివి.. శ్రీనివాసులు అతడి బంధువు ఆదెమ్మ మృతి చెందగా అంత్యక్రియల నిమిత్తం ఎమ్మిగనూరు పట్టణానికి వచ్చారు. అంత్యక్రియల అనంతరం గడిగే శ్రీనివాసులు, రాఘవేంద్ర, రాఘవేంద్ర ప్రసాద్ కలిసి ఎల్లెల్సీ కాలువకు స్నానానికి వెళ్లారు. స్నానం చేస్తుండగా నీటి ప్రవాహానికి శ్రీనివాసులు కొట్టుకుపోయినట్లు వెంట వెళ్లిన వారు చెప్పారు. అయితే తమకు అనుమానం ఉందని శ్రీనివాసులు భార్య లక్ష్మి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మరో ఇద్దరు..



ఫరీద్ (ఫైల్)

డోన్ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజా కాంప్లెక్స్ వెనుకవీధిలో కొత్తపేటకు చెందిన అశ్విని, పాతపేటకు చెందిన రౌడీషీటర్ ఫరీద్ ఇద్దరూ ఒకే ఇంట్లో సోమవారం అనుమానస్పద స్థితిలో మృతి చెందారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. పోలీసులు వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ ఇద్దరు కలసి ఆత్మహత్య చేసుకున్నారా? లేక ఎవరైనా హత్య చేశారా? వీరిద్దరూ అక్కడ ఎందుకున్నట్లు? అన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఒకే ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగినట్లు కొందరుచెబుతున్నారు. ఈ విషయంపై స్థానిక పోలీసులు, కర్నూలు క్లూజ్ టీమ్ వచ్చి పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మందలించిందని...

• పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య



లక్ష్మీనరసింహస్వామి (ఫైల్)

ఆదోని, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్లుబావి వీధికి చెందిన దేవేంద్ర, జ్యోతి దంపతుల కుమారుడు లక్ష్మీనరసింహస్వామి (25) పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణంలోని కల్లుబావి కాలనీకి చెందిన లక్ష్మీ నరసింహస్వామి మద్యంకు అలవాటు పడడంతో ఇంట్లో ఉన్న తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన లక్ష్మీనరసింహస్వామి మద్యంలో విషపూరిత మందు కలుపుకుని ఆదివారం తాగాడు. స్థానికులు హుటాహుటిన ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తీసుకెళ్లగా. చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మాధవస్వామి (ఫైల్)

ఆదోని, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆస్పరి రోడ్డు సోమవారం రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. సీఐ అబ్దుల్‌గౌస్ తెలిపిన వివరాల మేరు... ఆదోని పట్టణం లోని ఎంఐజీ కాలనీలో నివాసముంటున్న మాధవస్వామి(52) నారాయణ కాలేజీలో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నట్లు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం సమయంలో భోజనానికి ఇంటికి చేరుకుని భోజనం అనంతరం తిరిగి కాలేజీకి వెళ్తుండగా హాస్పిటల్ రోడ్డులోని జీవీ మాల్ సమీ పంలో మాధవస్వామి వెళ్తున్న సైకిల్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మాధవస్వామి అక్కడికక్కడే మృతిచెందాడు. ఇంటికి పెద్దదిక్కును కోల్పోవడంతో భార్య సుంకన్న, కుమారుడు శ్రీనాథ్ విలపిస్తున్న తీరును చూపరులను కంటతడి పెట్టించింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ అబ్దుల్‌గౌస్ తెలిపారు.

ఎల్లెల్సీలో మృతదేహం

కోడుమూరు రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వర్కూరు గ్రామ పరిధిలో ఎల్లెల్సీ కెనాల్‌లో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ప్రవాహంలో కొట్టుకవచ్చిన మృతదేహం 3ఎల్ కాలువ సమీపంలో కంపచెట్ల మధ్యలో నిలిచిపోయింది. అటుగా వెలుతున్న రైతులు విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ట్రైనీ ఎస్ఐ మణికంఠ సిబ్బందితో చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మృతుడి వయసు దాదాపు 40 ఏళ్లు ఉండవచ్చన్నారు. ఒంటిపై డ్రాయర్ మినహా దుస్తులు లేవన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు కోడుమూరు పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

నలుగురు నిందితుల అరెస్టు

• దొర్నిపాడులో ఉద్యోగాల పేరుతో మోసం కేసు

• రెండు జిల్లాలలో 1200 మంది బాధితులు



నిందితులతో డీఎస్పీ ప్రమోద్, సీఐ, పోలీసులు

ఆళ్లగడ్డ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొర్నిపాడులో ఉద్యోగాల పేరుతో రూ. కోట్లు వసూలు చేసి ఉడాయించిన నలుగురు నిందితులను దొర్నిపాడు మండలం కొండాపురం గ్రామాల మధ్య ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాం సమీపంలో అరెస్టు చేశారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నిందితులను డీఎస్పీ ప్రమోద్ అరెస్టు చూపించారు. అనంతపురం జిల్లా యెల్లనూర మండలం గొడ్డుమర్రి గ్రామానికి చెందిన అంతపు రాజారెడ్డికి దొర్నిపాడు గ్రామానికి చెందిన బాచిరెడ్డి వీరా రెడ్డి కుమార్తెతో వివాహమైంది. రుద్రవరం మండలం కొండమాయపల్లె గ్రామానికి చెందిన సింగతల ఉమామహేశ్వరరెడ్డి, దొర్నిపాడు గ్రామానికి చెందిన బాచిరెడ్డి వీరారెడ్డి, బాచిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి లతో కలిసి ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి మోసం చేశారు. రెండు జిల్లాల్లో 1200 బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. 2023లో హెల్త్ అండ్ వెల్త్ ఫైనాన్సియల్ సొల్యూషన్ పేరుతో కంపెనీ స్థాపించి హైదరాబాద్‌లోని కూకట్ పల్లి హెడిఎఫ్‌సీ బ్యాంక్‌లో కంపెనీ, వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలను ప్రారంభించారు. ఒక్కొక్కరి నుండి రూ 2.5 లక్షలు, రూ 3 లక్షలు, రూ 3.5 లక్షలు మొత్తాల్లో డిపాజిట్లు స్వీకరించి మోసం చేశారు. సులభంగా ఉద్యోగాలు వస్తాయని ఎవరూ ఇలాంటి మోసపూరిత పథకాలను నమ్మవద్దని డీఎస్పీ ప్రమోద్ తెలిపారు. రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఐ సతీశ్ హత్యపై సీబీఐ విచారణ జరపాలి

• ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

• కర్నూలులో కుమ్మరి కులస్థుల భారీ ర్యాలీ, ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సంఘం నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): టీటీడీ మాజీ ఏవీఎస్‌వో, జీఆర్పీ సీఐ సతీశ్ కుమార్ అనుమానాస్పద మృతిపై సీబీఐ దర్యాప్తు సంస్థతో విచారణ చేపట్టాలని కుమ్మరి శాలివాహన సంఘం నాయకులు, కులస్థులు డిమాండ్ చేశారు. శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కర్నూలులోని బీసీ భవన్ నుంచి కేసీ కెనాల్, మెడికల్ కాలేజీ, రాజ్ విహార్ మీదుగా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం సునయన ఆడిటోరియంలో జరుగుతున్న గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్ డాక్టర్ సిరికి నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్నాలో కర్నూలు జిల్లా శాలివాహన సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు, రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య, శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పీబీవీ సుబ్బయ్య మాట్లాడుతూ సతీష్ కుమార్‌ను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించిన టీటీడీ పరకామణిలో చోరీకి పాల్పడిన అనుమానితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సతీశ్ కుమార్ కుటుంబ సభ్యుల్లో ఒకరికి గ్రూప్-1 స్థాయి ఉద్యోగం ఇవ్వడంతో పాటు రూ.2 కోట్లు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే సతీష్ కుమార్ పిల్లలకు ఒకటో తరగతి నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ ధర్నాకు డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, సంఘం రాష్ట్ర అధ్యక్షులు మురళి మనోహర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేంపెంట రాంబాబు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా శాలివాహన సంక్షేమ సంఘం నాయకులు వై.నాగేశ్వరరావు, సోమేష్, 25 వార్డు ఓసీఎం రంగా, కే.మధు, చిన్న పుల్లయ్య, కే.లింగన్న, శ్రీనివాసులు, కేసీ నాగన్న, సుగూరు వెంకటేశ్వర్లు, కే.రమేష్, బీసీ, రజక వృత్తిదార్ల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పథకం ప్రకారమే సతీశ్ హత్య

• శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పేరేటి ఈశ్వర్



సతీశ్‌కుమార్ భార్య మమత, కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఈశ్వర్

పత్తికొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జీఆర్పీ సీఐ సతీశ్ కుమార్‌ది పథకం ప్రకారం జరిగిన హత్యేనని శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పేరేటి ఈశ్వర్ ఆరోపించారు. సోమవారం కార్పొరేషన్ డైరెక్టర్లతో కలిసి పత్తికొండకు వచ్చిన ఆయన.. సతీశ్‌కుమార్ భార్య మమతోపాటు కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ టీటీడీ పరకామణి సంఘటనకు సంబంధించి నిజాయితీగా సతీశ్‌కుమార్ కేసు నమోదు చేశారన్నారు. అప్పటి ప్రభుత్వ పెద్దలు సతీశ్‌కుమార్‌పై ఒత్తిడితెచ్చి లోక్‌అదాలత్‌లో కేసు రాజీ చేయించారన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక హైకోర్టు పరిధిలోకి వెళ్లిన కేసు సీఐడీ విచారణకు రావడంతో మొదటి విడతగా సతీశ్‌కుమార్ చోరీ వివరాలను, ఒత్తిడి అంశాలను వారికి తెలియజేశారన్నారు. మరోసారి విచారణకు వెళ్తుండగా తమ పేర్లు బయటకు వస్తాయనే భయంతో అప్పటి ప్రభుత్వ పెద్దలు పథకం ప్రకారమే ఈ దారుణానికి ఒడిగట్టి ఉండవచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఏదిఏమైనా ఓ నిజాయితీ పోలీసు అధికారిని కోల్పోయామని సతీశ్‌కుమార్ హత్యని సీరియస్‌గా తీసుకొని విచారణ చేస్తుందన్నారు. అనంతరం శాలివాహన చైర్మన్ పేరేటి ఈశ్వర్, కార్పొరేషన్ డైరెక్టర్లు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కలిశారు. సతీశ్‌కుమార్ కుటుంబానికి అండగా నిలుస్తామని ఎమ్మెల్యే అన్నారు.

తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే జైలు శిక్ష

• జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి



మాట్లాడుతున్న లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసి వారిని అనాథలుగా చేసే పిల్లలకు జైలు శిక్ష పడుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తెలిపారు. నగరంలోని బి.క్యాంపు, మద్దూరునగర్‌లోని రెండు వృద్ధాశ్రమాలను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఆయన వృద్ధులను చూసుకోవాల్సిన బాధ్యత వారి పిల్లలపై ఉందని, నిర్లక్ష్యం చేసిన వారి పిల్లలపై భరణం కేసులు దాఖలు చేసి భరణం రాబట్టుకునే హక్కు వృద్ధ తల్లిదండ్రులకు ఉంటుందని చెప్పారు. ఈ చట్టం ప్రకారం తల్లిదండ్రులను వదిలి వేస్తే మూడు నెలల జైలు శిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధించనున్నట్లు తెలిపారు. సంక్షేమ చట్టం-2007పై వృద్ధులకు అవగాహన కల్పించారు. వృద్ధులకు ఎవరికైనా న్యాయ సహాయం కావాలంటే వారు నేరుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను గాని, టోల్ ఫ్రీ నెంబరు 15100కు ఫోన్ చేసి సమస్యలను చెప్పుకోవచ్చని తెలిపారు. బాధిత తల్లిదండ్రుల తరుపున జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా న్యాయవాదిని నియమించిసమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ న్యాయవాది రాంపుల్లయ్య, సభ్యుడు డా.రాయపాటి శ్రీనివాస్, న్యాయవాది పాపారావు, కర్నూలు పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మద్దిలేటి, ఆశ్రమ నిర్వహకులు పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు



నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు

బేతంచెర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన సయ్యద్ మహబూబ్ బాషా అనే వ్యక్తిని ఈ నెల 12న హత్య చేసిన కేసులో నిందితుడు ముల్లకుర్తి మధు భూపాలుడు అలియాస్ మధుభూపాల్‌ను అరెస్టు చేసినట్లు సీఐ వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. రంగాపురం గ్రామం నుంచి మద్దిలేటి స్వామికి వెళ్లేదారిలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. హత్యకు ఉపయోగించిన బల్లెంను నిందితుడి నుంచి స్వాధీనం చేసుకు న్నట్లు చెప్పారు. డోన్ కోరులో హాజరు పరుచగా మెజిస్ట్రేట్ 14 రోజుల జుడీషియల్ రిమాండ్‌కు ఆదేశించారని సీఐ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

ఆస్పరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నహోతూరు బస్టాప్ వద్ద ముందు వెళ్తున్న లారీని తప్పించబోయిన మరో లారీ (ఆర్‌జే51జేబీ 6077) ప్రమాదానికి గురయ్యింది. బళ్లారి నుంచి నంద్యాలకు వెళ్తున్న లారీ విద్యుత్ విద్యుత్ స్తంభాన్ని సోమవారం బలంగా ఢీకొంది. రోడ్డు పక్కనే విద్యుత్ స్తంభానికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బిగించి ఉండడంతో స్తంభాన్ని ఢీకొట్టిన లారీకి ఒక్కసారిగా మంటలు చెలరేగి వ్యాపించాయి. లారీ క్యాబిన్ దగ్ధమయ్యింది. పక్కనే రైతు బోయ రంగన్నకు చెందిన గడ్డివామికి నిప్పురవ్వలు ఎగిసి పడడంతో గడ్డివామి కూడా పూర్తిగా కాలిపోయింది. ఆలూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసింది. అంతలోపే లారీ, గడ్డివామి కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రాణహానీ జరగలేదని సీఐ గంగాధర్ తెలిపారు. రంగన్న గడ్డివామి దహనంకావడంతో రూ.50 వేలు నష్టం వాటిల్లిందని తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అలరించిన 'భువన విజయం'



'భువన విజయం' నాటకంలోని ఒక దృశ్యం

కర్నూలు కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి, ఏపీ నాటక అకాడమీ సౌజన్యంతో నగరంలోని మద్దూర్‌నగర్ లోగల పింగళి సూరన తెలుగుతోట సమావేశ హాలులో ప్రదర్శించిన 'భువన విజయం' పౌరాణిక పద్య నాటకం ఆకట్టుకుంది. జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుర్రపుశాల అంకయ్య ఆధ్వర్యంలో ఈ నాటక ప్రదర్శన జరిగింది. అష్టదిగ్గజ కవులతో కొలువుదీరిన శ్రీకృష్ణదేవయాలు ఆయా కవుల పాండిత్యాన్ని వీనుల విందుగా వింటూ పరవశించిపోతాడు. ఈ భువన విజయంలో ఆయా పండితులు ఆలపించిన పద్యాలు వేటికవే పోటాపోటీగా కొనసాగాయి. బళ్లారి రాఘవ పురస్కార గ్రహీత రంగారెడ్డి శ్రీకృష్ణదేవరాయలుగా నటించగా, అల్లసాని పెద్దనగా శతావధారి గండ్లూరి దత్తాత్రేయ శర్మ, భట్టుమూర్తిగా శ్యామసుందర శాస్త్రి, అయ్యలరాజు రామభద్రకవిగా గుర్రపుశాల అంకయ్య, నంది తిమ్మనగా ఏలూరు యంగన్న, తిమ్మరుసుగా దత్తాత్రేయ శర్మ, ధూర్జటిగా జేఎస్‌ఆర్‌కే శర్మ, తెనాలి రామకృష్ణునిగా సూర్యనారాయణమూర్తి, పింగళి సూరనగా కేవీ మహీధరరావు, మాదయ్యగారి మల్లన్నగా ఎలమర్తి రమణయ్య నటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విద్యాసంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ జిల్లా ఖ్యాతిని చాటిచె ప్పేలా భువన విజయం నాటకం నిలుస్తుందని, కళాకారుల కృషి అభినందనీయమని అన్నారు.

పత్తి రైతులను ఇబ్బంది పెట్టొద్దు

• కొనుగోలులో ఆటంకాలు లేకుండా చూడండి : కలెక్టర్ సిరి

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బంది పెట్టకుండా సమర్థవంతంగా పని చేయండని కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి మార్కెటింగ్, సీసీఐ అధికారులను ఆదేశించారు. సోమవారం గూడూరు మండలం పెంచికలపాడు గ్రామంలో మంజిత్ కాటన్ జిన్నింగ్ అండ్ ప్రాసెసింగ్ యూనిట్‌లో సీసీఐ ద్వారా జరుగుతున్న పత్తి కొనుగోలు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించి అధికారులు, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అందిన ఆదేశాల ప్రకారం ఎకరాకు 10 క్వింటాళ్ల వరకు పత్తిని కొనుగోలు చేయాలని సీసీఐ అధికారులను స్పష్టం చేశారు. రైతులకు కొనుగోలు ప్రక్రియలో జాప్యం లేకుండా ఎటువంటి ఆటంకాలు కల్పించకుండా కొనుగోలు చేయాలని సూచించారు. కపాస్ కిసాన్ యాప్‌లో ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ సమయం మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా పత్తిలో తేమ శాతం 13 నుంచి 14 శాతం తేమ ఉన్నా కూడా పత్తిని కొనుగోలు చేయాలని సీసీఐ ప్రతినిధులకు సూచించారు. ఈ సందర్భంగా రైతులు పత్తి అమ్మకంలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వివిధ యాప్‌ల పేరుతో తాము సీసీఐ కేంద్రాన్ని అమ్ముకునేందుకు వీల్లేకుండా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కోసారి కపాస్ కిసాన్ యాప్ ఓపెన్ కావడం లేదని, అక్కడ స్లాట్ బుకింగ్ చేసుకున్నా కొనుగోలు కేంద్రాల వద్ద వెళ్లినప్పుడు తమకు డేట్ కన్‌ఫమ్ కాలేదని చెబుతున్నారని, దీని వల్ల తాము పత్తిని వెనక్కి తీసుకొని వెళ్లలేక అక్కడే మిల్లులో మద్దతు ధర కంటే తక్కువ ధరకు అమ్మాల్సిన పరిస్థితి ఎదురవుతుందని ఆవేదన చెందుతున్నారు. గ్రామాల్లో దళారులు, వ్యాపారులు తమ నుంచి పత్తిని కొనుగోలు చేస్తున్నారని, తమకు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తడం వల్లే వ్యాపారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చిందని రైతులు అంటున్నారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు మార్కెట్ కమిటీ సెక్రటరీ సుందర్‌రాజు, కర్నూలు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి నారాయణమూర్తి ఉన్నారు.

మనసు మార్చుకున్న దొంగ..!

• దొరికిపోతానేమోనన్న భయంతో బాధితుల ఇంటి వద్దే బంగారం పడేసి వెళ్లిన వైనం

కొలిమిగుండ్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరుమానుపల్లె గ్రామంలో ఈనెల 15న పట్టపగలే ఇంట్లో చొరబడి బంగారం చోరీ చేసిన దొంగ మనసు మార్చుకొని, ఆతర్వాత అక్కడే వదిలేసిపోయాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి జరిగింది. మారు తాళం చెవులు తీసుకొని తాళం ఓపెన్ చేసి దొంగతనానికి పాల్పడిన తీరుచూస్తే కచ్చితంగా అది తెలిసిన వారి పనేనని పోలీసులు భావించారు. పోలీసులు కేసుపై ప్రత్యేక దృష్టి సారించి, ఫింగర్ ప్రింట్ సేకరించారన్న సమాచారంతో.. తాను దొరికిపోతానేమో అనే భయంతో దొంగ చోరీ చేసిన నాలుగు తులాల బంగారాన్ని మొలక రాజారెడ్డి ఇంటి ఆవరణలో ఆదివారం అర్ధరాత్రి పడేసి పారిపోయాడు. ఈ క్రమంలో ఇంటి తలుపులపై రాళ్లతో కొట్టి శబ్దం చేసి డ్రామా సృష్టించాడు. రాజారెడ్డి కుటుంబ సభ్యులతో పాటు చుట్టు పక్కల వారు అర్ధరాత్రి నిద్రలేచి చూడగా చోరీ అయిన నాలుగు తులాల బంగారం రాజారెడ్డి ఇంటి ముందు కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.



తల్లీ బిడ్డల మృతిపై ఆరా


• నందవరంలో వివరాలు సేకరించిన వైద్య బృందం

నందవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నందవరానికి చెందిన తల్లీ బిడ్డల మృతి చెందిన ఘటనపై నందవరం వైద్యురాలు రేవతి, వైద్య బృందం సభ్యులు ఆరా తీశారు. సోమవారం నందవరంలో మృతురాలి కుటుంబం సభ్యులతో మాట్లాడారు. మౌనికను ప్రసవం నిమిత్తం ఈనెల 15న ఎమ్మిగనూరు ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు ఆమె భర్త జాన్, అత్త సుశీలమ్మ, మామ సుజ్ఞానం తెలిపారు. అక్కడ వైద్యులు మెరుగైన వైద్యసేవల కోసం కర్నూలు ఆసుపత్రికి వెళ్లాలని చెప్పారన్నారు. అయితే అంబులెన్స్ గంట ఆలస్యంగా వచ్చిందని, పైగా 30 కిలోమీటర్లు వరకే అనుమతి ఉందని వారు చెప్పడంతో వారిని ప్రాధేయపడే లోపు సమయం మరింత ఆలస్యం అయిందని చెప్పారు. దీంతో తల్లి, శిశువు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు.

నందవరంలో బాధిత కుటుంబ సభ్యులను ఆరా తీస్తున్న వైద్యులు

పాపయ్య కొండపై చిరుత

• ఫారెస్టు అధికారులు స్పందించాలని ప్రజల వినతి



పాపయ్య కొండపై కనిపిస్తున్న చిరుత పులి

కోసిగి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కోసిగి, నేలకోసిగి మధ్యలో ఉన్న పాపయ్య కొండపై సోమవారం ఉదయం చిరుతపులి స్థానిక రైతులకు, యువకుల కంట పడింది. కొండపైనే చిరుతపులి ఆవాసం ఏర్పాటు చేసుకుని గొర్రెలు, మేకలపై దాడులు చేస్తూ తీవ్ర నష్టం కలిగిస్తుందని గొర్రెల కాపరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫారెస్టు అధికారులు స్పందించి కొండపై ఉన్న చిరుత పులిని బంధించి తమకు రక్షణ కల్పించాలని కోరారు.

కాశీ విశ్వేశ్వరుడికి అభిషేకం


అలంకారంలో స్వామివారు

నంద్యాల కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం సందర్భంగా పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో కాశీవిశ్వేశ్వరుడికి భగవత్ సేవాసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో వెన్నాభిషేకం నిర్వహించారు. ముందుగా మహాదేవుడికి విశేష అర్చనలు, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తుల సహకారంతో వెన్నాభిషేకం చేశారు. కార్యక్రమంలో శివాలయ ప్రధాన అర్చకులు గోపి స్వామి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అభిరుచి మధు తదితరులు

నంద్యాల, నూనెపల్లి 17 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల టెక్కె సమీపంలోని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యాలయంలో ఆయుర్వేద ఆదిదేవుడైన ధన్వంతరి జయంతోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. భరతమాత, ధన్వంతరి చిత్రపటాలకు పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రధానవక్తగా అఖిల భారత కళా విభాగం ప్రముఖుడు అప్పాలప్రసాద్, ప్రభుత్వ సీనియర్ ఆయుర్వేద వైద్యాధికారినీ డా. యశోద, ఆరోగ్య భారతి జిల్లా అధ్యక్షుడు డా. పరమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో క్షేత్రోత్సవం

బండిఆత్మకూరు నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నల్లమలలో వెలసిన ఓంకార క్షేత్రంలో గంగా, ఉమా సమత సిద్ధేశ్వర స్వామివార్ల క్షేత్రోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం సాయంత్రం అర్చకులు పల్లకిని అందంగా తీర్చిదిద్ది గంగాఉమా సమేత సిద్ధేశ్వర స్వామివార్ల ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. క్షేత్రోత్సవంతో ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఈవో నాగప్రసాద్, చైర్మన్ చెన్నారెడ్డి, తెలుగుగంగ వైస్ చైర్మన్ ఈశ్వరరెడ్డి, పాలక మండలి సభ్యుడు నారాయణ, ఆచారి, భక్తులు పాల్గొన్నారు. ఆలయ పరిసరాలు శివనామ స్మరణ మార్మోగాయి. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పాస్టర్‌పై దాడి.. పోలీసులకు ఫిర్యాదు

నంద్యాల టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పాస్టర్‌పై చర్చి సభ్యులు దాడి చేసిన ఘటన పట్టణంలోని శ్యాంనగర్‌లో చోటు చేసుకున్నది. సోమవారం బాధితుడు పోలీసులను ఆశ్రయించారు. అనంతరం స్థానిక కార్యాలయంలో చర్చిల రాయలసీమ కో ఆర్డినేటర్ టైటస్, బాధితుడు పాస్టర్ ప్రవీణ్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గతంలో చర్చి కమిటీలో పని చేసిన పీరయ్య, జాన్, విజేయుడు, ఆటో రవి, రూతమ్మ, ప్రశాంత్, అమృత్ చంద్రశేఖర్ ఆదివారం మధ్యాహ్నం చర్చిలో ఉండగా దౌర్జన్యంగా వచ్చి దాడి చేశారన్నారు. వీరి చేసిన అక్రమాలు బయట పడతాయనే అనుమానంతో దాడి చేశారన్నారు. గతంలో వీరిపై త్రీటౌన్ పోలీసులకు చాలా సార్లు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు న్యాయ విచారణ చేస్తున్నట్లు వివరించారు.

వైసీపీ కార్యాలయంపై దాడి హేయం

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

నంద్యాల రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): హిందూపురంలో వైసీపీ కార్యాలయాన్ని టీడీపీ శ్రేణులు ధ్వంసం చేయడం హేయమైన చర్య అని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని గాంధీచౌక్‌లో మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్ బాషా ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. సోదీ జరిగిన ఘటనకు మౌనం పాటించారు. ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, పీపీ నాగిరెడ్డి, సాయినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

గడివేముల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీపీఐ ఎంఎల్ లెబరేషన్ పార్టీ మండల కార్యదర్శి అబ్దుల్‌సలామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన రైతులు ఆరబోసిన మొక్కజొన్న ధాన్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ లెబరేషన్ పార్టీ పార్టీ నాయకులు శ్రీనివాసులు, అల్లాబకాష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కృషితో రాష్ట్రానికి భారీ పరిశ్రమలు

గడివేముల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి వల్ల రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులతో నూతన పరిశ్రమలు వస్తున్నాయని మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సీఐఐ సమ్మిట్‌లో రాష్ట్రానికి రూ.13 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని హర్షం వ్యక్తం చేశారు. 16 లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు.

ఉద్యమకారుల సేవలను గుర్తించుకోవాలి

నంద్యాల కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమకారుల సేవలను గుర్తించుకోవాలని వక్తలు అన్నారు. సోమవారం నంద్యాల పింగళిసూరనస్మారక శాఖా గ్రంథాలయంలో స్వాతంత్ర్య సమరయోధుల సేవలను స్మరిస్తూ చర్చాగోష్ఠి నిర్వహించారు. అనంతరం ప్రభుత్వబాలికల పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అధికారి శ్రీధర్, ఉపాధ్యాయురాలు దుర్గాబాయి, సుబ్బారావు, నరేంద్రనాద్ శర్మ, వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, ప్రదీప్ పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు


శ్రీశైలంలో హుస్సేన్ నాయక్

శ్రీశైలం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. కార్తీక మాసం ఆఖరు సోమవారం క్షేత్రానికి వచ్చిన ఆయన ధూళి దర్శనం కోసం ప్రధాన గోపురం వద్దకు చేరుకోగా ఆలయ మర్యాదలతో చైర్మన్ పోతుగుంట రమేశ్ నాయుడు, ఈవో శ్రీనివాసరావు, అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు.


బండిఆత్మకూరు : శివనందిలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


మహానంది: నందీశ్వరుడికి ప్రదోషకాలపూజలు చేస్తున్న వేదపండితులు


బండిఆత్మకూరు: దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మార్మోగిన ఓంకారనాదం


కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. శైవక్షేత్రాలు ఓంకార నాదాలతో మార్మోగాయి. భక్తులు ఆలయాల్లోని కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం వితరణ గావించారు. మహానందిలో గంగాదేవికి జలహారతి ఇచ్చారు.

- ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్



ప్రథమనందీశ్వరుడికి అభిషేకాలు చేస్తున్న భక్తులు, కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


మిడుతూరులో..


మహానంది: గంగాదేవికి జలహారతి ఇస్తున్న అర్చకులు


కొత్తపల్లి: సంగమేశ్వరంలో..


పగిడ్యాల బంగ్లా శివాలయంలో..


గడివేముల: దుర్గాభోగేశ్వర ఆలయంలో..

పకడ్బందీగా అమలు చేయాలి


వీసీలో కలెక్టర్ రాజకుమారి

నంద్యాల, నూనెపల్లి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వరకట్న నిషేధ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. సోమవారం ఆమె తమ చాంబర్‌లో జూమ్ వీసీ ద్వారా ఎస్పీ, జాయింట్ కలెక్టర్, ఆర్డీవోలు, ఐసీడీఎస్ పీడీలతో డిస్ట్రిక్ అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వరకట్నం ఇచ్చుకోవడం, పుచ్చుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. జిల్లాలో డౌరీ నేరాలు, హత్యలు పూర్తిగా నివారించేందుకు యాక్ట్‌ను అమలు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

మునిశేషిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

పాణ్యం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నంద్యాల సమితి మాజీ అధ్యక్షుడు నల్లల మునిశేషిరెడ్డి మృతి టీడీపీకి తీరనిలోటని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. సోమవారం మునిశేషిరెడ్డి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. మునిశేషిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పెద్దాయన సేవలు, ఆశయాలు కొనసాగించాలని కోరారు. పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రంగ రమేష్, నాయకులు ఖాదర్‌బాషా, రమణమూర్తి, రామ్మోహన్‌నాయుడు, శివశంకరరెడ్డి, అమరసింహారెడ్డి, రవి, సురేష్, మోహన్ ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి

- మద్దతు ధరతో మొక్కజొన్న కొనుగోలు చేయాలి
- వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- పట్టణంలోని పటేల్ సెంటర్‌లో రిలే నిరాహార దీక్ష


పటేల్ సెంటర్‌లో రిలే నిరాహార దీక్ష చేపట్టిన వైసీపీ నాయకులు

నందికొట్కూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని, ఉల్లి రైతులకు హెక్టారుకు రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలని వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ధార సుధీర్ ఆధ్వర్యంలో పట్టణంలోని పటేల్ సెంటర్‌లో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ కర్నూలు జిల్లా ఉల్లి రైతులకు నష్టపరిహారం చెల్లించి, నంద్యాల జిల్లా రైతులకు నష్టపరిహారం చెల్లించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇది కూటమి ప్రభుత్వం వివక్షత చూపడమేనన్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. రైతులకు న్యాయం జరిగేవరకు వైసీపీ పోరాటం చేస్తుందన్నారు. సాయంత్రం డా.ధార సుధీర్‌కు కాటసాని రాంభూపాల్‌రెడ్డి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. దీక్షకు సీపీఐ, సీపీఐ (ఎంఎల్)లిబరేషన్‌లు తమ మద్దతు తెలిపాయి. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, వైసీపీ నాయకులు పుల్యాల నాగిరెడ్డి, బుడ్డా శేషిరెడ్డి, రైతు సంఘం నాయకుడు చంద్రారెడ్డి, వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో..

నందికొట్కూరు: రైతుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సీపీఎం, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద సీపీఎం నాయకుడు పక్కీర్ సాహెబ్ అధ్యక్షతన రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలో సీపీఎం రైతు సంఘం నాయకులు బెస్తరాజు, తారేష్‌రెడ్డి, కర్ణ, ఓబులేసు, రమణ, త్యాగరాజు, రామిరెడ్డి, నాగరాజు, సుజ్ఞానం, ఆంజనేయులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించడంలో నిర్లక్ష్యం తగదు


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కౌలు, రైతు సంఘం నాయకులు

నంద్యాల, నూనెపల్లి 17 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్లు, అధిక వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రుడు అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట కౌలు రైతు, రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్యుమరేషన్‌లో భారీగా లోపాలు జరిగాయని వాటిని అరికట్టాలన్నారు. ఈ క్రాప్ నమోదు ఆధారంగా కౌలు రైతులను గుర్తించాలని కోరారు. కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు అన్ని అమలు చేయాలన్నారు. దేవాలయ భూములు కౌలుకు సాగు చేసి నష్టపోయిన రైతులందరికీ మరో రెండేళ్లు ఉచితంగా ఆ భూములను ఇవ్వాలన్నారు. అనంతరం కలెక్టర్ రాజకుమారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘ జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహ, ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యక్షుడు మార్క్, సీమోన్, ఆశీర్వాదం, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

డోన్ ఏపీఎం అవినీతిపై విచారణ చేయాలి

డోన్ ఏపీఎం మల్లికార్జున అవినీతిపై విచారణ జరిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టర్ రాజకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగనాయుడు మాట్లాడుతూ కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశించారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, నాయకులు రమేశ్, హరినాథ్, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అవకాశాలను వినియోగించుకోవాలి

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రంగముని

నందికొట్కూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రంగముని సూచించారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎమ్మెల్యే గిత్తా జయసూర్యల ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించారు. ఎనిమిది ప్రైవేట్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు నిర్వహించిన జాబ్‌మేళాకు 153 మంది అభ్యర్థులు హాజరుకాగా 74 మంది ఉద్యోగాలు పొందారని జిల్లా నైపుణ్యా భివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, అన్వర్‌బాషా, కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి, ఏపీఎస్ఎస్‌డీసీ, ఎంప్లాయిమెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

నంద్యాల కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జమాఅతేఇస్లామీ హింద్ నంద్యాల శాఖ అధ్యక్షుడు అబ్దుల్ సమద్ ఆధ్వర్యంలో సోమవారం 'పొరుగువారి హక్కులు, దేశవ్యాప్త ఉద్యమం' పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమద్ మాట్లాడుతూ కుచించుకుపోతున్న మానవ సంబంధాలు పెం పొందించుటకు జమాఅతే ఇస్లామీ హింద్‌సంస్థ కృషి చేస్తుందన్నారు. నవంబరు 21-30వరకు దేశ వ్యాప్తంగా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యమ నిర్వాహకులు డాక్టర్ జక్రియ, మొహతరమా బేగం అమ్తుస్సలాం, అబ్దుల్ అలీం పాల్గొన్నారు.

బాలోత్సవ్‌లో గురురాజ విద్యార్థుల ప్రతిభ

- అభినందించిన డిప్యూటీ డీఈవో శంకర్, పాఠశాల చైర్మన్ డాక్టర్ దస్తగిరిరెడ్డి


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

నంద్యాల కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని గురు రాజ పాఠశాలలో అత్యంత వైభవంగా వీకెండ్ పెస్టీని నిర్వహిం చారు. పాఠశాల నిర్వాహ కులు పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ డీఈఓ శంకర్, గురురాజ విద్యాసంస్థల చైర్మన్ డా.పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జాతీయస్థాయిలో బాలోత్సవంలో రాష్ట్రవ్యాప్తంగా 1400 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో నంద్యాల గురురాజ స్కూల్ విద్యార్థులు సత్తా చాటి విజేతలుగా నిలిచినట్లు నిర్వాహకు లు తెలిపారు. అనంతరం బహుమతులు సాధించిన గురురాజ పాఠశాల విద్యార్థులను అభినందించారు. అలాగే వీకెండ్‌పెస్టీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వారిలో దాగివున్న ప్రతిభను వెలికి తీసేందుకు పోటీలలో పోటీపడ్డారు. ఈ సందర్భంగా విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మల్లన్న భక్తులకు అగచాట్లు..!

- ఆత్మకూరులో బస్సుల కోసం అవస్థ
- సర్వీసులు పెంచడంలో ఆర్టీసీ యంత్రాంగం విఫలం


శ్రీశైలం వెళ్లే బస్సు వద్ద ఎగబడిన జనం

ఆత్మకూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంతో పాటు సోమవారం కావడంతో శ్రీశైల మల్లన్న దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నారు. అయితే ఇక్కడ భక్తులకు సరిపడ బస్సు సర్వీసులు అందుబాటులో లేకపోవడంతో భక్తులు నానా అవస్థలు పడ్డారు. వాస్తవానికి ప్రతిరోజు రెగ్యులర్‌గా ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి శ్రీశైలానికి నాలుగు సర్వీసులతో పాటు నంద్యాల జిల్లా పరిధిలోని ఆయా డిపోల నుంచి నుంచి తొమ్మిది సర్వీసులు నడుస్తున్నాయి. అయితే కార్తీక మాసం సోమవారం కావడంతో ఆత్మకూరు నుంచి 4, జిల్లా నుంచి 16 చొప్పున మొత్తం 20 బస్సులను అందుబాటులో ఉంచారు. కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి కూడా బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. కానీ.. ఇతర డిపోల నుంచి వచ్చే బస్సుల్లో పూర్తిస్థాయి ఆక్యుపెన్సీ ఉండటం వల్ల ఆత్మకూరు డిపో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. దీనికితోడు మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పించడం వల్ల మహిళలు భారీగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ప్రత్యేకించి కార్తీక మాసం కావడంతో శ్రీశైలంతో సహా ఇతర శైవక్షేత్రాలకు మహిళలు అధిక సంఖ్యలో తరలివెళ్తున్నారు. ఈ కారణాల వల్ల బస్సుల్లో సీట్లు లభించక ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. అదేక్రమంలో గతంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు నిలబడి వెళ్లే వెసులుబాటు ఉండేది. కానీ.. శ్రీశైలం ఘాట్ రోడ్డులో వెళ్లే బస్సుల్లో ప్రయాణికులు నిలబడి ప్రయాణించరాదని నిబంధనలు ఉండటంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఆర్టీసీ అధికారులు స్పందించి ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులను అందుబాటులో ఉంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆలయ అభివృద్ధికి పాటుపడాలి


ప్రమాణ స్వీకారం చేస్తున్న లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ పాలక మండలి సభ్యులు

బండిఆత్మకూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పాలక మండలి సభ్యులు ఆలయ అభివృద్ధి పాటుపడాలని గ్రూప్ దేవాలయాల ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, శ్రీశైలం ట్రస్టుబోర్డు సభ్యుడు డాక్టర్ చిట్టిబొట్ల భరద్వాజ శర్మ సూచించారు. సోమవారం మండలంలోని బీ కోడూరు చెన్నకేశవస్వామి ఆలయ నూతన పాలక మండలి చైర్మన్‌గా బొంగు ఉదయ్ కుమార్, డైరెక్టర్లుగా రామసుబ్బారెడ్డి, వెంకటజ్యోతి, ఇ.లక్ష్మిదేవి, ఎల్లాకృష్ణ, వెంకటేశ్వర్లు, సాలమ్మ, కే లక్ష్మిదేవి, ప్రసాదరావు, శ్రీధర్‌తో ఇన్‌స్పెక్టర్ ప్రమాణం చేయించారు. పాలక మండలి సభ్యులను ఆలయ అధికారులు, టీడీపీ నాయకులు, గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధానకార్యదర్శి చలమయ్య, బాలుడు, సుధాకర్‌రెడ్డి, హుస్సేనయ్య, రమేష్, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

ఆత్మకూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఒంగోలులోని గౌతమి ఫౌండేషన్ చైర్మన్ అంకయ్య చౌదరి అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోని ఎన్టీఆర్-కేవీకే స్టేడియంలో రాష్ట్ర స్థాయి అండర్ - 14, 17 బాలబాలిక ఖోఖో క్రీడా కోచింగ్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ షాబుద్దిన్, ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ నూర్‌బేగ్, నాయకులు షాబుద్దిన్, వాలీబాల్ అసోషియేషన్ సెక్రటరీ నిమ్మి కృష్ణ, శిక్షకులు మహెబూబ్, వెంకటేశ్వరగౌడ్, ఉపేంద్ర, జబ్బార్ తదితరులు ఉన్నారు.

నేడు ఉమామహేశ్వర స్వామి కల్యాణం

ఆత్మకూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం మాసశివరాత్రిని పురస్కరించుకుని స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. ముందుగా ఆలయంలో ప్రాతఃకాలంలో ప్రత్యేక పూజలు, సాయంత్రం దీపోత్సవాన్ని జరపనున్నారు. రాత్రి 7గంటలకు స్వామిఅమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు వెల్లడించారు.

సరైన విత్తనాన్ని ఎంపిక చేసుకోవాలి

బండిఆత్మకూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రైతులు సరైన విత్తనాన్ని ఎంపిక చేసుకొని అధిక దిగుబడులు పొందాలని ఏవో పవన్‌కుమార్ సూచించారు. సోమవారం సాయంత్రం కాకనూరులో పెద్ద వెంకటయ్య అనే రైతు సాగు చేసిన ఎంటీయూ 1426 రకం వరి పంటను ఆయన పరిశీలించారు. ఈ రకం విత్తనం దాదాపు 42 బస్తాల దిగుబడి వస్తున్నట్లు రైతులు పేర్కొన్నారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది యశోద పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నందికొట్కూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తైక్వాండో కోచింగ్ సెంటర్ మాస్టర్ రాంబాబు అభినందించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 14, 15, 16 తేదీల్లో కాకినాడలో జరిగిన 39వ రాష్ట్ర తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఆయా విభాగాల్లో విద్యార్థులు మల్లికార్జున, లిశిన్ కుమార్, అబిద, సురయి కౌశిక్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని హర్షం వ్యక్తం చేశారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

వెలుగోడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు వ్యవసాయశాఖ అధికారి స్వాతి ఆదేశించారు. సోమవారం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని సూచించారు. బిల్లులు ఇవ్వాలని సూచించారు.

నేటి నుంచి టీటీడీ ధార్మిక కార్యక్రమాలు

వెలుగోడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రామలయంలో మంగళవారం నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం హిందు ప్రచార సమితి ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం ఆలయ ఆవరణలో పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రామలయ కమిటీ అధ్యక్షుడు లాలం శ్రీనివాసులు, కార్యదర్శి తాళ్లురి సంజీవరాయప్రసాద్, వాసవి కన్యాక పరమేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షులు లాలం సుధాకర్ పాల్గొన్నారు.

దుద్యాలలో మొక్కజొన్న ధాన్యం చోరీ

కొత్తపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్యాల గ్రామ శివారులో ఓ రైతు రోడ్డుపై ఉంచుకున్న 12 ప్యాకెట్ల మొక్కజొన్న బస్తాలు చోరీకి గురైనట్లు కొత్తపల్లి ఏఎస్ఐ రామ్‌నాయక్ తెలిపారు. ఏఎస్ఐ వివరాల మేరకు గ్రామానికి చెందిన రైతు తెలుగు మురళి గ్రామ శివారులోని చెలిమెల రహదారిపై కాటా వేసి ఉంచిన 12 బస్తాల మొక్కజొన్న ప్యాకెట్లను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ఎత్తుకెళ్లారు. బాధిత రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ తెలిపారు.

కార్పొరేట్లకే ప్రభుత్వాలు అనుకూలం

మాజీ ఎమ్మెల్యే గఫూర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గఫూర్

బేతంచెర్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్లకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ అన్నారు. సీఐటీయూ నంద్యాల జిల్లా 3వ మహాసభలు బేతంచెర్లలో సోమవారం ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా సీఐటీయూ సీనియర్ నాయకుడు ఎల్లయ్య జెండాను ఆవిష్కరించారు. ముందుగా కొత్తబస్టాండు నుంచి పాతబస్టాండు వరకు కార్మికులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో ఎంఏ గఫూర్ మాట్లాడుతూ ఉత్పత్తితో కార్మికుల వేతనాలు ముడి పెట్టాలనే చంద్రబాబు ఆలోచన దుర్మార్గమైందన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వి.ఏసురత్నం లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని తీర్మానాన్ని ప్రవేశపెట్టగా.. నంద్యాల జిల్లా అధ్యక్షుడు కేఎండీ గౌస్ ఆ తీర్మానానికి బలపరిచారు. అంతకుముందు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆలమూరి నాగరాజు గత మూడేళ్లుగా సీఐటీయూ చేపట్టిన కార్యక్రమాలను కార్యదర్శి నివేదిక రూపంలో ప్రవేశపెట్టారు. ఈ మహాసభలను సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి పరిశీలించారు. కార్యక్రమంలో అనుబంధ సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సహకార సంఘం ఎన్నికలు

కోవెలకుంట్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాల, భీమునిపాడు, గుళ్లదుర్తి గ్రామాల్లో సోమవారం జరిగిన పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. లింగాల గ్రామంలో 23 మంది సభ్యులు ఉండగా అందులో డైరెక్టర్లుగా దూదేకుల హుసేనయ్య, దూదేకుల దేవహుసేనిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి వెంకటరామిరెడ్డి తెలిపారు. అలాగే భీమునిపాడులో పాల ఉత్పత్తిదారులు 17 మంది సభ్యులుండగా అందులో డైరెక్టర్లుగా బి.సుధాకర్‌రెడ్డి, జి.రమేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి మధు తెలిపారు. అలాగే గుళ్లదుర్తిలో పాల ఉత్పత్తిదారులు 78 మంది సభ్యులుండగా డైరెక్టర్లుగా పేర వివేకానందరెడ్డి, కొర్రరామరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

ఎస్టీ కమిషన్ సభ్యుడిని కలిసిన తెలుగు యువత అధ్యక్షుడు

దొర్నిపాడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వెంకటప్పను సోమవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మండలంలోని భాగ్యనగరం గ్రామానికి చెందిన తెలుగు యువత అధికార ప్రతినిధి తాళ్లూరి రమేష్‌నాయుడు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రమేష్‌నాయుడు మాట్లాడుతూ ఎస్టీలకు అన్ని విధాలా న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి



కోవెలకుంట్ల గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

దొర్నిపాడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి అఖిలాబేగం అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: విద్యార్థులు పుస్తకాలు చదవి విజ్ఞానం పెంచుకోవాలని కోవెలకుంట్ల గ్రంథాలయ అధికారి బాలతిమ్మారెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు గ్రంథాలయంలో పుస్తక పఠనం నిర్వహించారు. కార్యక్రమంలో గిద్దలూరు గ్రంథాలయ అధికారి మద్దిలేటి, విద్యార్థులు పాల్గొన్నారు.

చాగలమర్రి: గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని గ్రంథాలయాధికారి రామచంద్రుడు అన్నారు. సోమవారం భారతీ విద్యామందిరంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. హెచ్‌ఎం ప్రసాద్, కాంతారావు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న బీసీ రాజారెడ్డి



గాయపడ్డ వృద్ధురాలికి ప్రాథమిక చికిత్స చేయిస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి గురైన ఓ వృద్ధురాలిని బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి తన సొంత వాహనంలో ఆస్పత్రికి తరలించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు వివరాలివి.. ప్యాపిలి పట్టణానికి చెందిన వృద్ధురాలు చెరువమ్మ కార్తీక కడ సోమవారం సందర్భంగా యాగంటి క్షేత్రానికి వచ్చి తిరుగు ప్రయాణంలో ఆమె బంధువు వెంట ప్యాపిలి వెళ్తుండగా మార్గమధ్యలో దద్దనాల ప్రాజెక్టు వద్ద రోడ్డు ప్రమాదానికి గురైంది. ఆమె తలకు బలమైన గాయాలయ్యాయి. అదేమార్గంలో బనగానపల్లెకు వస్తున్న బీసీ రాజారెడ్డి సంఘటనను గమనించి వెంటనే గాయపడ్డ ఆమెను సొంతవాహనంలో బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులతో మాట్లాడి ప్రాథమిక చికిత్సలు చేయించి, మెరుగైన వైద్యం కోసం ఆమెను నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. గాయపడ్డ వృద్ధురాలు బీసీ రాజారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కొలిమిగుండ్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపాడు గ్రామ సమీపంలో వీరభద్రస్వామి గుడి వద్ద పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి 10మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు కొలిమిగుండ్ల సీఐ మద్దినేని రమేష్‌బాబు సోమవారం తెలిపారు. పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు తన సిబ్బందితో కలిసి దాడి చేయగా 10మంది పేకాట రాయుళ్లతోపాటు రూ.8,200 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సారా స్వాధీనం

ప్యాపిలి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతమ్మ తండా పరిసర ప్రాంతాల్లో నాటుసారా స్థావరాలపై సోమవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో బాలునాయక్, లక్ష్మీనాయక్, సరస్వ తిబాయ్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 180లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈదాడుల్లో ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి, ఎస్ఐ సోమశేఖర్‌రావు పాల్గొన్నారు.

కార్తీక శోభ

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- కార్తీక దీపాలు వెలిగించిన మహిళలు

జిల్లా వ్యాప్తంగా ఆలయాల వద్ద కార్తీక శోభ సంతరించుకుంది. చాలమర్రిలోని రామలింగేశ్వర, భీమలింగేశ్వర, బుగ్గమల్లేశ్వర, భైరవీశ్వర, మలయచల ఆలయాల్లో కడ సోమవారం సందర్భంగా పూజలు చేసి దీపాలు వెలిగించారు. కొలిమిగుండ్లలోని లలితా సుందరేశ్వరస్వామి, బెలుం సిద్ధరామేశ్వరస్వామి, గుండు మల్లేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. అవుకులో వెలసిన కాశీవిశ్వనాథస్వామి, చెర్లోపల్లెలోని బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయాల వద్ద భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. ప్యాపిలి పట్టణంలోని ఈశ్వర స్వామి, నీలకంఠేశ్వరస్వామి, భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. దొర్నిపాడు మండలం చాకరాజువేముల గ్రామ శివాలయంలో భక్తులు పూజలు చేశారు. రుద్రవరం, వాసాపురం, ఉల్లెండ కొండల్లోని ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. డోన్ పట్టణ సమీపంలోని షిరిడీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో కార్తీక సహస్ర దీపోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, కమిటి సభ్యులు సీఎం శ్రీనివాసులు, శ్రీరాములు పూజలు చేశారు. సాయంత్రం కార్తీక సహస్ర దీపోత్సవం నిర్వహించారు. బేతంచెర్ల మండలంలోని ముచ్చట్ల భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రం భక్తులతో సోమవారం కిక్కిరిసిపోయింది. సంజామల మండలం నయనాలప్ప క్షేత్రంలో వెలిసిన ఓంకారేశ్వరుడి కల్యాణం కన్నుల పండువగా సాగింది. వేద పండితులు స్వామి వారికి కల్యాణం జరిపించారు. క్షేత్రంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. క్షేత్రంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ మండల మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు ఈ శిబిరాన్ని కోవెలకుంట్ల సీఐ హనుమంత నాయక్ ప్రారంభించారు.

• ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్



చాగలమర్రి: కోదండరామాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు





కొలిమిగుండ్ల శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు, డోన్: షిరిడీ సాయిబాబా ఆలయంలో కార్తీక సహస్ర దిపోత్సవం



ప్యాపిలిలో పూజలు నిర్వహిస్తున్న పురోహితుడు, భక్తులు



బేతంచెర్ల మండలం ముచ్చట్ల క్షేత్రంలో..



రుద్రవరం: ఉల్లెడకొండకు వచ్చిన భక్తులు



సంజామల: ఓంకారేశ్వరుడి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



అవుకు శివాలయం వద్ద బారులు తీరిన భక్తులు



దొర్నిపాడు: చాకరాజువేముల శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

న్యూ క్యాటగిరి విజేత తెలంగాణ ఎద్దులు

సంజామల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నయనాలప్ప తిరుణాల సందర్భంగా క్షేత్రంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి ఎద్దుల రాతి దూలం లాగుడు పోటీల్లో తెలంగాణ ఎద్దులు విజేతగా నిలిచాయి. న్యూ క్యాటగిరిలో విభాగంలో జరిగిన ఈ పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి 14 జతల ఎద్దులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లా, నాగర్ కర్నూలు రాయవరం గ్రామానికి చెందిన అక్షర రెడ్డి ఎద్దులు రాతి దూలాన్ని అత్యధిక దూరం లాగి ప్రథమ విజేతగా నిలిచాయి. ద్వితీయ స్థానంలో నంద్యాల జిల్లా ఆలగనూరుకు చెందిన రోలిమేడం ఎద్దులు, తృతీయ స్థానంలో మహబూబ్ నగర్ జిల్లా నాగర్ కర్నూలు రాయవరం గ్రామానికి చెందిన ధనుష్ రెడ్డి ఎద్దులు, నాలుగో స్థానంలో కడప జిల్లా పెద్దముడియం మండలం పాలూరు గ్రామానికి చెందన శానిక రెడ్డి ఎద్దులు, ఐదో స్థానం అనంతపురం జిల్లా గంజికుంటపల్లె చెందిన హనుమంత రెడ్డి ఎద్దులు, ఆరో స్థానంలో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరుకు చెందిన గోన నరసింహారెడ్డి ఎద్దులు విజేతలుగా నిలిచాయి. వీరికి ప్రోత్సాహక నగదును నంద్యాల మాజీ ఎమ్మెల్యే రవిచంద్ర కిశోర్ రెడ్డి, తలారి లక్ష్మి, బాష్యం నాగేశ్వర రెడ్డి అందజేశారు.



రాతి దూలాన్ని లాగుతున్న ఎద్దులు

దత్తత స్వీకారంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ సునీల్ కుమార్

ఆళ్లగడ్డ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక సీడీపీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ ప్రత్యేక మాసోత్సవాల సందర్భంగా సోమవారం బాలల సంరక్షణ విభాగం అధికారులు దత్తత స్వీకారంపై అంగన్‌వాడీ కార్యకర్తలు, అధికారులకు అవగాహన కల్పించారు. నంద్యాలలోని ప్రత్యేక దత్తత కేంద్రంలో ప్రభుత్వ సంరక్షణలో ఉన్న పిల్లలను దత్తత తీసుకునేందుకు ముందుకు వచ్చే తల్లిదండ్రుల కోసం వెబ్ సైట్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు కౌన్సిలర్ సునీల్ కుమార్, సోషల్ వర్కర్ ఓబులమ్మలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో తేజశ్వరీ, సూపర్‌వైజర్ దస్తగిరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

డోన్ రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో భూకబ్జాలకు పాల్పడిన అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకుడు ఈశ్వరయ్య మాదిగ కోరారు. ఈ మేరకు డోన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రాకేష్‌బాబుకు ఫిర్యాదు చేశారు. ఈశ్వరయ్య మాదిగ మాట్లాడుతూ ధర్మవరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ప్రభుత్వ మిగులు భూమి 50 సెంట్లను గత ప్రభుత్వంలో వైసీపీ చెందిన కొందరు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఎస్సీ కాలనీలో మిగులు భూమి స్థల పరిశీలనకు వెళ్లిన తనపై కొందరు వ్యక్తులు దౌర్జన్యానికి పాల్పడి కులం పేరుతో దూషించారని, వారిపై చర్యలు తీసుకోవాలని సీఐకి ఫిర్యాదు చేశారు. వీటిపై విచారిస్తామని సీఐ బాధితుడికి హామీ ఇచ్చారు.

నిందితులను శిక్షించాలి

డోన్ రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జీఆర్పీ సీఐ వై.సతీశ్ కుమార్ హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు పోతుల నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణ సమీపంలోని హైవే రోడ్డులో ఓ హోటల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక పోలీస్ అధికారికే ఇలా జరిగితే.. సామాన్యుల పరిస్థితి ఏంటనీ ఆయన ప్రశ్నించారు. బాధిత కుటుంబానికి రూ.10 కోట్ల పరిహారాన్ని ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పట్టణాభివృద్ధికి కృషి: మున్సిపల్ ఛైర్మన్

డోన్ టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణాభివృద్ధి కృషి చేస్తానని మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. సోమవారం పట్టణం లోని మున్సిపల్ కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2026-27 సంవత్సరానికి గానూ 12.5 కోట్లతో బడ్జెట్‌కు సంబంధించిన అంచనా నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. సమావేశంలో కమిషనర్ ప్రసాద్‌గౌడు, డీఈ రఘు, ఏఈ సురేష్ పాల్గొన్నారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

చాగలమర్రి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని భీమలింగేశ్వర ఆలయం వద్ద వేద పండితులు పెద్దశాస్త్రి ఆధ్వర్యంలో సోమవారం శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. దంపతులతో పార్వతి పరమేశ్వరుల కల్యాణం చేయించారు. భక్తులు పెళ్లి చదివింపులు చదివించారు. అనంతరం శివపార్వతుల ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ధర్మకర్త నాగయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కల్యాణం చేస్తున్న వేదపండితులు

కుక్కల దాడిలో రెండు దూడలు మృతి

చాగలమర్రి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని చింతలచెరువు రహదారిలో లాలయ్య అనే రైతుకు చెందిన గేదెలు, దూడలపై సోమవారం కుక్కలు దాడి చేశాయి. కుక్కలు కరవడంతో రెండు గేదె దూడలు అక్కడికక్కడే మృతి చెందగా మరో 5 గేదెలు గాయపడ్డాయి. విషయం తెలుసుకున్న పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్, పశు వైద్య సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మృతి చెందిన దూడ లను పరిశీలించారు. గాయపడ్డ గేదెలకు చికిత్సలు చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

శిరివెళ్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): శిరివెళ్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పీడీ షేక్షావలి సోమవారం తెలిపారు. స్కూల్‌లైఫ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వ హించిన జిల్లాస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో నవనీత, మహబూబ్‌బాషా నాజియ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటారన్నారు.

భగవద్గీత సర్వ మానవాళికి మార్గదర్శి

కొలిమిగుండ్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): భగవద్గీతే సర్వ మానవాళికి మార్గదర్శి అని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక తాడిపత్రి కమిటీ అధ్యక్షుడు బాలయ్య అన్నారు. సోమవారం చింతలాయపల్లె గ్రామంలో భగవద్గీత గ్రంథాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. సభ్యులు రామానంద, శ్రీనివాసులు, చంద్రమోహన్, సురేష్ పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై ఇంటింటా సర్వే

చాగలమర్రి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని 11వ వార్డులో కుష్టువ్యాధి గుర్తింపు కోసం ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని వైద్యశాఖ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆశాలు, వలంటీర్లు నిర్వహించారు. 692 ఇళ్లను సందర్శించి వారిలో 34 మందిని అనుమానిత కేసులుగా గుర్తించారు.

శిరివెళ్ల: శిరివెళ్ల పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న కుష్టువ్యాధి గుర్తింపు కోసం ఇంటింటా సర్వేను జిల్లా ప్రోగ్రామ్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి సోమవారం పరిశీలించారు. వైద్యులు ముఖేష్, ఆంజనేయులు, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

డోన్ డిప్యూటీ ఎంపీడీవోగా చంద్రశేఖర్

డోన్ రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): డోన్ డిప్యూటీ ఎంపీడీవోగా చంద్రశేఖర్ సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో బాధ్య తలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఈవోఆర్డీ (డిప్యూటీ ఎంపీడీవో) ఫకృద్దీన్ చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఆదోని మండలానికి చెందిన చంద్రశేఖర్ పదోన్నతిపై డోన్ డిప్యూటీ ఎంపీడీ వోగా బాధ్యతలు తీసుకున్నారు. ఆయనకు డోన్ ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు అభినందనలు తెలియజేశారు.

మయాలూరులో వన భోజనాలు



భోజనాలు వడ్డిస్తున్న గ్రామస్థులు

ఉయ్యాలవాడ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాయలూరు గ్రామంలో సోమవారం వనభోజనాలు ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా నయనాలప్ప క్షేత్రానికి వెళ్లే భక్తులు భోజనాలు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు భోజనాలు వడ్డిం చారు. కోవెలకుంట్ల, గుళ్లదుర్తి, అల్లూరు, తుడుమలదిన్నె, ఉయ్యాలవాడ, రూపనగుడి, సుద్దమల్ల, పడిగెపాడు, హరివరం తదితర గ్రామాల నుంచి పలు వాహనాలు వెళ్లే వేలాదిగా భక్తులను ఆపి మరీ భోజనాలు వడ్డించారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న మూలే రామేశ్వర రెడ్డి

కొలిమిగుండ్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలబిళం తిరుణాళ్ల సందర్భంగా రెడ్‌క్రాస్, గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర రెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు హుసేన్ రెడ్డి, అంబటి వివేకానంద రెడ్డిలు ప్రారంభించారు. స్వామి దర్శనం కోసం తరలి వచ్చి భక్తుల కోసం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడంపై గ్రామీణ వైద్య సంఘం బృందాన్ని మూలే రామేశ్వరరెడ్డి అభినందించారు. గ్రామీణ వైద్యులు గురు మోహన్, వలి, సుబ్బరాయుడు, శివ, రంగా పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలోని కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాజా మురళీకృష్ణ ఆధ్వర్యంలో డోన్ మల్టీ స్పెషాలిటి ఆస్పత్రి వారు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యులు లోక్‌నాథ్, దిలీప్‌కుమార్ రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

యాగంటి క్షేత్రానికి వెండి హారతి



వెండి హారతిని అందజేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

బనగానపల్లె, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి క్షేత్రానికి పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అరకిలో వెండి హారతిని సోమవారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈసందర్భంగా ఆయన ఆలయంలో పూజలు చేశారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సూపరింటెండెంట్‌కు సభ్యత్వ నమోదు పత్రాన్ని అందజేస్తున్న చంద్రశేఖర్

డోన్ రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం తాలుకా అధ్యక్షుడు చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం డోన్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. సూపరింటెండెంట్ హనీఫ్‌కు సభ్యత్వ నమోదు పత్రాన్ని అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘ మహిళా వింగ్ అధ్యక్షురాలు రాజేశ్వరి, సహాయ కార్యదర్శి రాఘవేంద్ర, కళావతి, సుజాత, శ్రీలక్ష్మి, కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు రాంభూపాల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

అవుకు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని డోన్ డిప్యూటీ డీఈవో వెంకట్రామిరెడ్డి అన్నారు. సోమవారం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామ్స్ అధికారి రఘురామిరెడ్డితో కలిసి పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్‌స్కూల్, సెంట్‌మేరీస్ స్కూల్‌లోని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. డిప్యూటీ డీఈవో మాట్లాడుతూ 2025-2026లో నిర్వహించే పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో అవసరమయ్యే వసతులు, సదుపాలయాలను పరిశీలించామ న్నారు. చదువులో వెనుకబడ్డ విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆయన వెంట ఎంఈవోలు శ్రీధర్‌రావు, వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.

పరీక్షలకు గైర్హాజరు కాకూడదు

సంజామల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరు కాకూడదని సర్వశిక్ష అభియాన్ ఎంఈవో మాధవి ఉపాధ్యాయులను కోరారు. సోమవారం మండలంలోని మండల కేంద్రంలోని కేజీబీవీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పేరుసోమల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆమె సందర్శిం చారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడారు. నాణ్యమైన విద్యను బోధించాలని కోరారు. సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్.ఎ - 1 పరీక్షలకు విద్యార్థులు గైర్హాజరు కావడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి ప్రతి పరీక్షకు హాజరు కావాలని తెలిపారు. అనంతరం పేరుసోముల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ శ్రీలేఖ, ప్రధానోపాధ్యాయుడు షబ్బీర్ హుసేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.